



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

సోమవారం,
డిసెంబర్ 2, 2024

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 10 వెల 4/-




## మహా సీఎం ఫడణవీస్?

బీజేపీ సీనియర్ నేత వెల్లడి..

మోదీ, షాలదే తుది నిర్ణయమన్న శిందే

ముంబైలో నేడు మహాయుతి భేటీ



2లో

## బహిరంగ చర్చకు రండి..

చార్జిషీట్ సంగతి తేలుస్తాం

మీ పదేళ్ల పాలన.. మా ఏడాది పాలనపై చర్చించేందుకు వస్తారా?

బీఆర్ఎస్, బీజేపీలు కవల పిల్లలని మరోమారు రుజువైంది: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఫైర్



## ఏడుగురు మావోయిస్టుల మృతి

ఘటనా స్థలంలో ఏగోలపు మల్లయ్య మృతదేహం

**ఆదివారం ఉదయం 6.15 గంటలు. అప్పటిదాకా పక్షుల కిలకిలారావాలు వినిపించిన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక సమీప పొలకమ్మ వాగు అటవీ ప్రాంతంలో ఉన్నట్టుండి తుపాకులు గర్జించాయి. మావోయిస్టులు-గ్రేహౌండ్స్ బలగాల మధ్య భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది.**

వరంగల్/ఏటూరు నాగారం: ఈ ఘటనలో ఏడుగురు మావోయిస్టులు మరణించినట్లు ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ ప్రకటించారు. మృతుల్లో తెలంగాణకు చెందిన ఒక మావోయిస్టు ఉండగా మిగతా ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని ఆయన తెలిపారు. ఎస్పీ కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నవంబర్ 21న రాత్రి ములుగు జిల్లా వాజేడులో ఉయికే రమేష్, ఉయికే అర్జున్‌లను ఇన్‌ఫార్మర్ల పేరిట మావోయిస్టులు హత్య చేశారు. ఈ నేపథ్యంలో గ్రౌహౌండ్స్ బలగాలు ములుగు జిల్లా అడవుల్లో కూంబింగ్ ముమ్మరం చేశాయి.

## సంక్రాంతి తర్వాత రైతు భరోసా..

అసెంబ్లీలో చర్చించి విధివిధానాల ఖరారు.. మారీచులు చెప్పే అబద్ధాలను నమ్మొద్దు

- గత ప్రభుత్వం ఎగ్గొట్టిన 2023 వానాకాలం
- రైతుబంధు సాయాన్ని మేం చెల్లించాం
- 7,625 కోట్లను తొలి విడతగా అందించాం
- మేం వచ్చేనాటికి రూ.7లక్షల కోట్ల అప్పులు
- ఐనా.. రుణమాఫీ పథకాన్ని అమలు చేశాం
- నాలుగు విడతల్లో 20,616.89 కోట్ల మాఫీ
- బీఆర్ఎస్ చేసింది కేవలం రూ.3,331 కోట్లే
- సన్న ధాన్యానికి వచ్చే సీజన్‌లోనూ బోనస్
- కిషన్‌రెడ్డి.. హామీలపై ప్రత్యేకంగా చర్చిద్దాం
- మోదీ చేసిందీ.. మేం చేసిందీ తేలుద్దాం
- ఎన్నో విజయాలు సాధిస్తుంది: సీఎం రేవంత్



**అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర రైతాంగానికి రైతు భరోసా పథకాన్ని అందించి తీరతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదన్నారు. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో భరోసా సొమ్మును జమ చేస్తామని తెలిపారు. ఈ పథకం అమలుకు సంబంధించి విధివిధానాలను ఖరారు చేసేందుకు ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని గుర్తు చేశారు. ఉపసంఘం చేసే సూచనలపై ఈ నెలలో నిర్వహించే శాసనసభ సమావేశాల్లో చర్చించి, విదివిధానాలను ఖరారు చేస్తామన్నారు.**

హైదరాబాద్: సోనియాగాంధీ గ్యారెంటీగా చెబుతున్నానని, ఈ విషయంలో ఏ మారీచులు వచ్చి అబద్ధాలు చెప్పినా నమ్మవద్దని అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఎం మాట్లాడారు. రైతుభరోసా పథకంపై ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలను మారీచులు, రాక్షసులతో పోల్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నవంబరు 28 నుంచి 30 వరకు నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకు మంచి ఆదరణ వచ్చిందన్నారు.

2లో



## కనీసం ముగ్గురిని కనండి

జనాభా క్షీణిస్తే సమాజమే అంతరిస్తుంది!

భాషలు, సంస్కృతి కూడా కనుమరుగవుతాయి


ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలు

## త్వరలోనే కొత్త వక్ఫ్‌బోర్డు

వక్ఫ్ ఆస్తులను రక్షించలేకపోయిన పాత బోర్డు

అందుకే రద్దుచేశాం: రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి: వారం, పది రోజుల్లో నూతన వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు కూటమి ప్రభుత్వం తెలిపింది. ముందుగా అర్హులైన సభ్యులతో కొత్త బోర్డును ఏర్పాటు చేస్తామని, అనంతరం సమర్థుడైన వ్యక్తిని చైర్మన్‌గా సభ్యులు ఎన్నుకొంటారని పేర్కొంటూ



# సంక్రాంతి తర్వాత రైతు భరోసా..



రైతుల ఆశీర్వాదం, సంపూర్ణ మద్దతుతో ఈ ప్రభుత్వం ఇంకా తొమిదేళ్లు ఎన్నో వియాలు సాధిస్తుందని తనకు సంపూర్ణ విశ్వాసం కలిగిందన్నారు."తెలంగాణ ఏర్పడే నాటికి ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో, రూ.69 వేల కోట్ల అప్పులతో కేసీఆర్‌కు రాష్ట్రాన్ని అప్పగించింది. అలాంటి రాష్ట్రాన్ని 2023 డిసెంబరులో కాంగ్రెస్ మళ్లీ అధికారం చేపట్టే నాటికి రూ.7 లక్షల కోట్ల అప్పు, ప్రతినెలా వడ్డీలు, అసలు కలిపి రూ.6,500 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితికి తీసుకువచ్చారు." అని సీఎం రేవంత్ అన్నారు. ప్రజలపై అప్పుల భారం మోపలేదని, అద్భుతమైన పరిపాలనను అందిస్తున్నామని, రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చామని అప్పటి ప్రభుత్వం సందర్భం వచ్చినప్పుడల్లా దాడులు చేసిందని ఆరోపించారు. అందుకే తాము అధికారం చేపట్టిన తరువాత ఆస్తులు, అప్పులు, విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులపై వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించేందుకు శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు. అప్పులను చూసి అ?ధైర్యపడకుండా.. ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తున్నామని చెప్పారు.

అన్ని పథకాలను తెచ్చింది కాంగ్రెస్సే..

రైతులకు హరిత విప్లవం, సాగునీరు, ఉచిత విద్యుత్, రాయితీతో ఎరువులు, పండిన పంటలకు సబ్సిడీ, ఆహార భద్రత చట్టం, పంటలకు మద్దతు ధర, ఉపాధి హామీ పథకం దాకా కాంగ్రెస్ పార్టీయే అమల్లోకి తెచ్చిందని సీఎం రేవంత్ చెప్పారు. రైతులు, రైతు కూలీలను దృష్టిలో పెట్టుకుని వాటికి చట్టబద్ధత కల్పించిందన్నారు. అయితే వీటివల్ల రైతుల జీవితాల్లో మార్పులు పూర్తిస్థాయిలో రాలేదని, గత పాలకుల నిర్లక్ష్యం, అకాల వర్షాలు, కరువు ఇందుకు కారణమని అన్నారు. అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం ఎగ్గొట్టిన 2023 వానాకాలం రైతుబంధు సాయాన్ని తాము అందజేశామని చెప్పారు. 2024 జనవరిలో ప్రారంభించి మార్చి వరకు రూ.7,625 కోట్లను మొదటి విడతగా అందించామన్నారు. ఆ తరువాత ఆగస్టు 15 వరకు రుణమాఫీ చేస్తామని రైతులకు మాట ఇచ్చామని, దాని ప్రకారం 25 రోజుల్లోనే రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలను నాలుగు విడతల్లో కలిపి 25,35,964 మంది రైతు కుటుంబాలకు రూ.20,616.89 కోట్ల రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏ రాష్ట్రంలోనూ ఎవరూ ఇప్పటివరకు ఇంత తక్కువ కాలంలో ఇంత పెద్దమొత్తంలో రుణమాఫీ చేయలేదని అన్నారు.

**బీఆర్ఎసకు అర్హత లేదు..**

రికార్డు స్థాయిలో తాము రుణమాఫీ చేసినా.. బీఆర్ఎస్ నాయకులు పదే పదే ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ ఏం చెప్పిందో ఓసారి గుర్తు చేసుకోవాలన్నారు. 2014లో రూ.లక్ష రుణమాఫీ హామీ ఇచ్చి.. నాలుగు విడతల్లో చేస్తామని చెప్పారని, వడ్డీ కూడా చెల్లిస్తామన్నారని గుర్తు చేశారు. మళ్లీ 2018లోనూ రూ.లక్ష రుణాన్ని ఒకేసారి మాఫీ చేస్తామని చెప్పి.. చేయలేదన్నారు. చివరకు 2023 ఎన్నికలు సమీపించే సమయానికి ఔటర్ రింగు రోడ్డును అమ్మి.. హడావిడిగా చేశారని, అది కూడా 21,35,557 మంది రైతులకు రూ.11,909.31 కోట్లను మాత్రమే మాఫీ చేశారని తెలిపారు. నాలుగున్నరేళ్ల తరువాత మాఫీ చేయడం ద్వారా రూ.లక్ష రుణం ఉన్నవారికి వడ్డీకే రూ.8,578.97 కోట్లు చెల్లించాల్సి వచ్చిందన్నారు. దీంతో వడ్డీలకు పోను రూ.3,331 కోట్లే అసలు కింద జమ అయిందన్నారు. కానీ, ఏడాది కూడా కాకముందే దాదాపు రూ.20,616 కోట్ల మేర రుణమాఫీ చేసిన తమను తప్పుబట్టాలని, రైతుల ముందు దోషిగా నిలబెట్టాలని ఉబలాటపడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అన్నీ తెలుసునని, వారు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో పూర్తిస్థాయిలో మాఫీ చేయని రూ.లక్ష రుణాలు రైతులు రెన్యువల్ చేసుకున్నవేనని, ఈ విషయం తాము చేసిన రుణమాఫీలో తేలిందని తెలిపారు. అందుకే 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు తీసుకున్న రుణాలను తాము చెల్లించామని చెప్పారు. రేషన్‌కార్డు లేకపోతే రుణమాఫీ జరగబోదనేది అవాస్తవమని, భూమి ఉండి, రుణం ఉండి అర్హులైన వారందరికీ మాఫీ అవుతుందని స్పష్టం చేశారు.

# ఏడుగురు మావోయిస్టుల మృతి



(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం ఉదయం చెల్పాక అడవుల్లో 10 నుంచి 12 మంది ఆలివ్‌గ్రీన్ దుస్తులు ధరించిన సాయుధ మావోయిస్టులు.. పోలీసు పార్టీలను గుర్తించి వెంటనే కాల్పులు మొదలెట్టారు. ఆయుధాలు వదిలి లొంగిపోవాలని హెచ్చరించినా వినకుండా కాల్పులు కొనసాగించారు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మిగతా వారు పారిపోగా ఘటన స్థలంలో రెండు ఏకే%-%47 రైఫిళ్లు, ఒక జీ%-%6, ఒక ఇన్సాస్, 303 రైఫిళ్లు, మందుగుండు సామగ్రి పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. మృతులను తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఇల్లందు, నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి కుర్సం మంగు అలియాస్ భద్రు, పాపన్న (35), దండకారణ్యం డివిజన్ కమిటీ సభ్యుడు, ఏటూరునాగారం%-%మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు, కోటి, కమలాకర్ (43), ఏరియా కమిటీ సభ్యులు ముస్సాకి దేవల్ అలియాస్ కరుణాకర్ (22), ముస్సాకి జమున (23), పార్టీ సభ్యులు జైసింగ్ (25), కిషోర్ (22), కామేష్ (23)గా పోలీసులు గుర్తించారు. ఏగోలపు మల్లయ్యది తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామం కాగా, మిగతా ఆరుగురు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పాగా వేసేందుకు మావోయిస్టులు ప్రయత్నాలు చేసినప్పటికీ ఆటంకాలు ఎదురయ్యాయి. అయితే 2015 సెప్టెంబర్ 15న ములుగు జిల్లా వెంగళాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ వడ్డేపల్లికి చెందిన ఎంటెక్ విద్యార్థి తంగళ్లపెల్లి శ్రుతి అలియాస్ మహిత, వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం పెండ్యాలకు చెందిన మణికంటి విద్యాసాగర్‌రెడ్డి అలియాస్ సాగర్ మరణించారు. అప్పట్నుంచి సుమారు తొమ్మిదేళ్ల తర్వాత ఆదివారం భారీ ఎన్‌కౌంటర్ జరగడం కలకలం రేపుతోంది. మావోయిస్టు పార్టీ సాయుధ విభాగం పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ఏర్పడి 24 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ రెండురోజుల క్రితమే పిలుపునిచ్చింది. ఈ మేరకు వారోత్సవాలకు సన్నద్ధమవుతున్న సమయంలో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుని ఏకంగా ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం ఆ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

**33 ఏళ్ల తర్వాత మళ్లీ వార్తలకెక్కిన చెల్పాక**

తాజా ఎన్‌కౌంటర్‌తో చెల్పాక పేరు 33 ఏళ్ల తర్వాత మళ్లీ వార్తలకెక్కింది. 1991 జూన్ 21న అప్పటి పీపుల్స్‌వార్, ఇప్పటి మావోయిస్టు పార్టీ నక్సలైట్లు భారీ మందుపాతర పేల్చారు. ఈ ఘటనలో ఏటూరునాగారం సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ కిషోర్‌కుమార్ సహా ఏడుగురు సీఆర్‌పీఎఫ్ పోలీసులు మరణించారు. రాజీవ్‌గాంధీ మరణానంతరం జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల పోలింగ్ రోజునే గ్రామ సమీపాన నక్సలైట్లు ఈ ఘటనకు పాల్పడ్డారు. చెల్పాక పోలింగ్ కేంద్రంలోని బ్యాలెట్ బాక్సుల్లో సిరా పోసి, పథకం ప్రకారం పోలీసులకు సమాచారం చేరవేసి రప్పించిన నక్సల్స్.. ఈ భారీ మందుపాతర పేల్చారు. అదే చెల్పాక సమీప అడవుల్లో తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. భారీ ఎన్‌కౌంటర్ పల్లెల్లో కలకలం రేపింది. ఇన్‌ఫార్మర్ల పేరిట వాజేడులో ఇద్దరి హత్య, ఆదివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌తో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎన్‌కౌంటర్ తర్వాత కూడా పోలీసు బలగాల కూంబింగ్ కొనసాగుతూనే ఉంది. పీఎల్‌జీఏ వారోత్సవాలను భగ్నం చేసేందుకు గొత్తికోయ గూడాలు, అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో జల్లెడ పడుతున్నారు.

# త్వరలోనే కొత్త వక్ఫ్‌బోర్డు

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. "గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటైన వక్ఫ్ బోర్డు, వక్ఫ్ ఆస్తులు పరిరక్షించడంలో పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించింది. పాలనా కార్యకలాపాలను కూడా విస్మరించింది. పైగా న్యాయ వివాదాల్లో చిక్కుకుంది. దీనిపై దాఖలైన పెండిగ్ వ్యాజ్యాలలో హైకోర్టు సూచనల మేరకు చర్యలు తీసుకున్నాం. వక్ఫ్‌బోర్డును రద్దు చేశాం. గత ప్రభుత్వం తెచ్చిన జీవో నం.47కు ఉపసంహరించాం" అని ఆ ప్రకటనలో తెలిపింది.

**జీవో నం.47 ఉపసంహరణకు కారణాలివే...**

గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా విడుదల చేసిన జీవోల్లో జీవో నం.47 ఒకటి. ఈ జీవోకు వ్యతిరేకంగా కోర్టుల్లో 13 రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి. ముస్లిం మైనారిటీల్లో ప్రధాన సమూహాలైన సున్నీలు, షియాలకు వక్ఫ్‌బోర్డులో ప్రాతినిధ్యం లేకుండాపోయింది. మాజీ ఎంపీలను బోర్డులో చేర్చుకోలేదు. జూనియర్ న్యాయవాదులను ఎంపిక చేయడం సీనియర్ న్యాయవాదులతో వివాదాలకు దారి తీసింది. వివిధ కోర్టుల్లో కేసుల కారణంగా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎన్నిక జరగలేదు. మార్చి 2003 నుంచి బోర్డు కార్యకలాపాలు స్తంభించాయి. వక్ఫ్‌బోర్డు దీర్ఘకాలికంగా పని చేయకపోవడం, దాని చట్టబద్ధతను ప్రశ్నిస్తూ రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జీవో నం.47ను రద్దుచేసింది. కూటమి ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు వ్యవస్థనే పూర్తిగా రద్దు చేసినట్టు కొన్ని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అ?ధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ తెలిపారు. సీఎం చంద్రబాబు, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్... మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారికి అండగా ఉంటున్నారని పేర్కొన్నారు.

# మహా సీఎం ఫడణవీస్?

(మొదటి పేజీ తరువాయి)

ముంబై, డిసెంబరు1: మహారాష్ట్రకు కాబోయే ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీసేనని, ఒకటి రెండు రోజుల్లో లాంఛనంగా ఎన్నికవుతారని బీజేపీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. మరోవైపు నేడు జరిగే మహాయుతి సమావేశంలో ఈ విషయంపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఈ సమావేశానికి బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్, శివసేన అధ్యక్షుడు, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ హాజరవుతారు. మంత్రిత్వ శాఖల కేటాయింపులపై ముగ్గురు నేతలు చర్చిస్తారు. హోం, పట్టణాభివృద్ధి, పీడబ్ల్యూడీ, ఆర్థిక శాఖలతో పాటు అసెంబ్లీ స్పీకర్ పదవిపై మూడు పార్టీల మధ్య గట్టి పోటీ ఉండటంతో ఈ సమావేశానికి ప్రాధాన్యత అదిరింది. హోం, స్పీకర్ పదవి విషయంలో బీజేపీ పట్టు వదలడం లేదు. ఈ కారణం వల్లే కొత్త సీఎం ప్రకటన ఆలస్యం అవుతోందని సమాచారం. డిసెంబరు రెండులోగా దీనిపై తేల్చుకోవాలని, లేదంటే తామే నిర్ణయిస్తామని అమిత్ షా మహాయుతి కూటమి నేతలకు స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో శాసనసభాపక్షను ఎన్నుకునేందుకు బీజేపీ ఎమ్మెల్యేలు నేడు లేదా రేపు సమావేశం కానున్నారు. దేవేంద్ర ఫడ్నవీసను బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకుంటారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. సొంతూరుకు వెళ్లిన శిందే తన మౌనాన్ని వీడారు. మహారాష్ట్ర కొత్త ముఖ్యమంత్రి విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలదే తుది నిర్ణయమన్నారు. మహాయుతి కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని శిందే స్పష్టం చేశారు. తన ఆరోగ్యం మెరుగుపడిందని చెప్పారు. మహారాష్ట్రలో కొత్తగా ఏర్పడే మహాయుతి ప్రభుత్వంలో ఏక్‌నాథ్ శిందే తనయుడు శ్రీకాంత్ శిందే డిప్యూటీ సీఎం రేసులో ఉన్నారని తెలుస్తోంది.

# కనీసం ముగ్గురిని కనండి

(మొదటి పేజీ తరువాయి)

నాగపూర్: ప్రతి భారతీయ కుటుంబం కనీసం ముగ్గురేసి పిల్లలను కనాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎసఎస్) చీఫ్ మోహన్ భాగవత్ పిలుపిచ్చారు. జనసంఖ్య క్షీణిస్తే సమాజమే అంతరిస్తుందని హెచ్చరించారు. ఆయన ఆదివారమిక్కడ నాగపూర్‌లో నిర్వహించిన 'కథాలే కుల్ సమ్మేళన్'లో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత జనాభా విధానం పాతికేళ్లనాటిదని.. 1998లో లేదా 2002లో ఖరారు చేశారని.. జన సంఖ్య వృద్ధి రేటు 2.1కి తగ్గకూడదని అందులో స్పష్టం చేశారని గుర్తుచేశారు. 'కుటుంబం సమాజంలో భాగం. ప్రతి కుటుంబం ఓ యూనిట్. జనాభా తగ్గుదల ఆందోళన కలిగించే అంశం. వృద్ధి రేటు 2.1కి తక్కువగా ఉంటే. సమాజం అంతరించిపోతుంది. ఆ పరిస్థితుల్లో దానినెవరూ నాశనం చేయనక్కర్లేదు. తనంత తానే నాశనమవుతుంది. భాషలూ కనుమరుగవుతాయి. సంస్కృతీ నశిస్తుంది. ప్రతి జంటా ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను.. కనీసం ముగ్గురిని కనాలి. ఈ విషయాన్ని జనసంఖ్య శాస్త్రమే చెబుతోంది. సమాజం మనుగడ సాగించాలంటే పిల్లల సంఖ్య ముఖ్యం' అని భాగవత్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణ, మతపరమైన జనాభా.. ఈ రెండు అంశాలూ విస్మరించడానికి వీల్లేనివని చెప్పారు. గతంలో నాగపూర్‌లోనే జరిగిన దసరా ర్యాలీలో కూడా ఆయన జనాభా పెరుగుదల అవసరాన్ని నొక్కిచెప్పారు. ప్రతి కోణంలో ఆలోచించి అన్ని వర్గాలకు వర్తించేలా నూతన జనాభా విధానాన్ని రూపొందించాలని ఆ సందర్భంగా అన్నారు. వివిధ వర్గాల జనాభాలో అసమతుల్యం.. భౌగోళిక సరిహద్దులనూ ప్రభావితం చేస్తుందని తెలిపారు. 'జనాభా అత్యధికంగా ఉంటే భారం ఎక్కువగా ఉంటుందన్నది నిజమే. కానీ జనాభాను సక్రమంగా వినియోగించుకుంటే అదో వనరుగా మారుతుంది. 50 ఏళ్ల తర్వాత మన దేశం ఎంత మందికి ఆహారం అందించగలుగుతుందనేది కూడా పరిగణనలోకి తీసుకోవాలి' అని భాగవత్ అభిప్రాయపడ్డారు. మహిళను తల్లిగా పరిగణించడం మంచిదేనని.. అయితే వారిని ఇళ్లలో నాలుగు గోడలకే పరిమితం చేయడం మంచిది కాదని చెప్పారు.

# బహిరంగ చర్చకు రండి..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జిషీట్ అంటూ బీజేపీ చేస్తున్న హడావుడి చూస్తుంటే గురివింద సామెత గుర్తుకు వస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన, కేంద్రంలో బీజేపీ పదేళ్ల పాలనపై ఆ పార్టీ నేతలు తమతో బహిరంగ చర్చకు వస్తే చార్జిషీట్ సంగతి తేలుస్తామని వ్యాఖ్యానించారు. తమతో చర్చకు వచ్చే సత్తా బీజేపీ నేతలకు ఉందా అని మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది కాలంలో తెలంగాణలో అమలవుతోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై తాము చర్చకు రెడీగా ఉన్నామని చెప్పారు.ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామని, నల్లధనం తెచ్చి ప్రతి అకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తామని, వంద రోజుల్లో అన్ని ధరలు తగ్గిస్తామని, డాలర్‌కు పోటీగా రూపాయి విలువ పెంచుతామని, నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని, రూ.50కే లీటర్ పెట్రోల్ ఇస్తామని చెప్పిన బీజేపీ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అప్రజాస్వామికంగా వ్యవహరించి ప్రభుత్వాలను కూల్చా రని, దేశ వ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన 411 మంది ఎమ్మెల్యేలను చేర్చు కున్న బీజేపీ నేతలు తమకు సుద్దులు చెబుతారా అని ప్రశ్నించారు. 45 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా దేశంలో నిరుద్యోగ తీవ్రత ఉందని గుర్తు చేశారు.2014, 2019, 2024 ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన మేనిఫెస్టోను తీసుకొని ఆ పార్టీ నేతలు వస్తే, తమ 2023 ఎన్నికల మేనిఫెస్టోను తీసుకొని తాము వస్తామని, ఏడాదిలో ఏం చేశామో తాము చెబుతామని, పదేళ్లలో ఏం చేశారో బీజేపీ నేతలు చెప్పాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటేనని మరోమారు రుజువైందని, సమయం వచ్చినప్పుడల్లా ఆ పార్టీలు ఏ టీం, బీ టీంలా వ్యవహరిస్తాయని ఎద్దేవా చేశారు.

## ఆసిఫాబాద్ జిల్లాను వణికిస్తున్న పులి.. పులి అన్వేషణలో నిమగ్నమైన బృందాలు



హైదరాబాద్, డిసెంబర్ 1 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాను పులి వణికిస్తున్నది. సిర్పూర్(టి) మండటం ఇటిక్యాల పహాడ్ శివారులో పులి సంచారం కలకలం రేకెత్తిస్తున్నది. రెండు రోజుల వ్యవధిలో మూడు పశువులు, ఇద్దరు మనుషులపై దాడికి పాల్పడింది. శనివారం లేగ దూడను చంపి ఎద్దుపై దాడి చేసింది. కెనాల్ ఏరియాలో పులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఆదివారం ఇటిక్యాల పహాడ్ అటవీప్రాంతాన్ని ఫారెస్ట్ అధికారులు జల్లెడ పట్టారు. పులి మానటరింగ్ కోసం 10 ప్రత్యేక బృందాలను, 200 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి ఆచూకీని గుర్తించేందుకు డ్రోన్‌ను వినియోగించి మహారాష్ట్రకు రెండు కిలో మీటర్ల దూరంలో పులి ఉన్నట్టు గుర్తించారు. శుక్రవారం చేనులో పని చేస్తున్న ఓ మహిళపై పులి దాడి చేయగా ఆమె చనిపోయింది. శనివారం సురేశ్ అనే రైతుపై దాడి చేయగా అతడు మంచిర్యాల దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

**ఆవును చంపిన చిరుత**

బజార్‌హత్నూర్, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం బుర్కపల్లి అటవీ ప్రాంత శివారులో చిరుత పులి ఆవుపై దాడి చేసి చంపింది. అటవీ అధికారి పుండలిక్ వివరాల ప్రకారం బుర్కపల్లికి చెందిన రైతు రవి శనివారం ఆవును మేపేందుకు అడవి సమీపంలోకి పంపాడు. రాత్రి వరకు ఆవు తిరిగి రాకపోవడంతో ఆదివారం ఉదయం గాలించగా ఆవుపై చిరుత దాడి చేసిన ఆనవాళ్లు కనిపించడంతో ఫారెస్టు అధికారులకు సమాచారం అందించాడు. ఆవు విలువ రూ.30 వేలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.

**ఆపరేషన్ టైగర్**

ఆసిఫాబాద్ జిల్లాలోని 15 గ్రామాల్లో అధికారులు 163సెక్షన్ విధించారు. కవ్వాల్ అభయారణ్యంలో నాలుగేళ్లలో పులుల సంఖ్య అనుహ్యంగా పెరిగిందని అటవీశాఖ అధికారులు తెలిపారు. అందుకే ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నవంబర్‌లో సహజంగా మగ ఆడ పులులు జతకట్టే సమయం అని, అందులో భాగంగా పులులు సాధారణం కంటే తమ జోడు కోసం అడవిలో ఎకువ దూరం ప్రయాణం చేస్తుంటాయని అధికారులు చెప్పారు. కొన్ని సందర్భాల్లో అడవిని దాటి చుట్టుపకల ప్రాంతాల్లోనూ సంచరిస్తూ ఉంటాయని వెల్లడించారు. ఈ సమయంలో పులులు సహజంగా కొంత ఉద్రేకంతో ఉంటాయని తెలిపారు. తమ తోడును వెతుకునే క్రమంలో పులులు చురుకుగా తిరుగుతూ ఉంటాయని, అందుకే నవంబర్,డిసెంబర్‌లో పులి దాడులు పెరుగుతున్నాయని అధికారులు వివరించారు.




## భువనగిరి వసుంధర

## థియేటర్ లో కేసీఆర్ సినిమాకు అపూర్వ ఆదరణ

### - సినిమాను వీక్షించిన బీఆర్ఎస్ నాయకులు జనగాం పాండు -డా, ర్యాకల శ్రీనివాస్

వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) జబర్దస్త్ యాక్టర్ రాకింగ్ రాకేశ్ నిర్మించిన కేసీఆర్ సినిమాకు భువనగిరి పట్టణ కేంద్రంలో అపూర్వ ఆదరణ లభిస్తుంది. వసుంధర థియేటర్లో సినిమా చూసేందుకు, భువనగిరి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాక్లల శ్రీనివాస్, కేసీఆర్ అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు భారీఎత్తున తరలివచ్చారు. సినిమా నడుస్తున్నంత వరకు ఈలలు, కేరింతలతో సినిమా థియేటర్ మారుమోగింది.సినిమాకు సంగీత దర్శకుడు చరణ్అర్జున్ అందించిన పాటలు అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఓ గిరిజన యువకుడు తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు కేసీఆర్ ప్రసంగాలు విని అభిమానిగా మారిపోయే సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి ఎకువగా స్పందన లభించింది. చిత్రంలోని కథానాయకుడు రాకేశ్ చెప్పిన డైలాగులు ఆకట్టుకున్నాయి. కేసీఆర్ ప్రసంగం వచ్చినప్పుడు అభిమానులు థియేటర్ హంగామా చేస్తున్నారు.థియేటర్లో వీక్షించిన బీఆర్ఎస్ నాయకులు జనగాం పాండు, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ సినిమాలో తెలంగాణ యాస, భాషను చకగా తెరకెకించారని, ప్రత్యేక రాష్ట్రం సాధించిన తర్వాత తెలంగాణ రాష్ట్రం సినిమాలకు చకటి వేదిక అయిందన్నారు. సినిమాలో నటించిన నటీనటులందరికీ అభినందనలు తెలియజేశారు



## పూరి జగన్నాథ స్వామి ఆలయాన్ని దర్శించుకున్న బండారు సుధాకర్ రెడ్డి మిత్ర బృందం

### అన్నారు జగన్నాథ స్వామి విగ్రహాన్ని చెక్కతో తయారు చేయడం అద్భుతం

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

హయత్ నగర్ శ్రీ వెంకటేశ్వర రియల్ ఎస్టేట్ అధినేత బండారు సుధాకర్ రెడ్డి మిత్ర బృందం, సంకిపల్లి నరసింహారెడ్డి (ఎస్ ఎన్ ఆర్) ముప్పిడి అరుణాకర్ రెడ్డి, మునగాల శేఖర్ రెడ్డి, బసిరెడ్డి మల్లారెడ్డి, పన్నల రాజు రెడ్డి, పిసాటి వెంకట్ రెడ్డి, అమ్మి రెడ్డి భూపాల్ రెడ్డి, నల్లనికి కిరణ్, పూరి జగన్నాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూరీలో ఉన్న జగన్నాథ దేవాలయంలో అత్యంత ప్రాచీనమైందని భారత దేశంలోని హిందువులు తప్పక దర్శించాల్సిన నాలుగు పుణ్యక్షేత్రాల్లో పూరి జగన్నాథ ఆలయం ఒకటని తెలిపారు జగన్నాథుని పూజా కార్యక్రమాలు సాధారణంగా హిందూ సాంప్రదాయ ఆగమాల ప్రకారం కాకుండా భిన్నంగా ఉంటాయని అన్నారు. ఇతర విగ్రహాలను మట్టితోనూ. రాతితోనో ,ఏదైనా లోహంతోనో చేస్తే ఈ విగ్రహాన్ని మాత్రం చెక్కతో తయారు చేయడం విశేషం అని తెలిపారు

## ప్రభుత్వానికి ఆదాయ వనరులు సమకూర్చే రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుందేలు అయింది

### రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు నమ్మకం కలిగించాలి

### కన్యక పరమేశ్వరి (కే పి ఆర్) రియల్ ఎస్టేట్ అధినేత సికీలమెట్ల సతీష్



హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి ( గణేష్ సాగర్)

ప్రభుత్వానికి ఆదాయ వనరులు సమకూర్చే రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుందేలు అయిందని ఈరోజు సామాన్య ప్రజల నుండి మొదలుకొని బడ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రియల్ రంగం అందుబాటులో లేదని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా కమిషన్ మూలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు ప్రస్తుతం రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఏజెంట్లు ప్లాట్లు భూములు, కొనుగోలుదారు, అమ్మకపుదారులు, ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు, కావున రాష్ట్ర ప్రభుత్వం ఒక చొరవ తీసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు నమ్మకం కలిగించాలని తెలిపారు కన్యకా పరమేశ్వరి రియల్ ఎస్టేట్ అధినేత సికిలమెట్ల సతీష్



## అల్లిపూర్ పద్మశాలి యువజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 1

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలోని పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుల అధ్యక్షతన పద్మశాలి యువజన సంఘ భవనం లో సమావేశం జరిగినది. ఇట్టి సమావేశంలో ఆదివారము రోజున నూతన కార్యవర్గం ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది.అధ్యక్షులుగా మోర గణేశం, ఉపాధ్యక్షులుగా నామని శేఖర్, ప్రధాన కార్యదర్శిగా మోర శివకుమార్, సంయుక్త కార్యదర్శిగా స్వర్గం శ్రీనివాస్, కోశాధికారిగా నామని లక్ష్మీ నరసయ్య, సలహాదారులుగా బాలె చంద్రశేఖర్, భోగ నర్సయ్య, మోర వెంకటేశ్వర్లు, పొట్టవత్తిని నాగభూషణం, అనుమల్ల మల్లేశం, బొమ్మ కంటి సురేష్, వేముల సతీష్, మిట్టపల్లి రాజేశం, దామోదర్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కులపెద్దలు వీరిని అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ మహిళలకు సబ్ కోట లేని మహిళా రిజర్వేషన్లు మాకెందుకు

### ఢిల్లీలో బీసీల హక్కుల కోసం బలంగా ప్రతిఘటిస్తాం.

### బీసీలను సంఘటితం చేస్తాం,రానున్నది బీసీల రాజ్యమే.

### దాసు సురేశ్, వ్యవస్థాపక అధ్యక్షులు - బీసీ రాజ్యాధికార సమితి.



మంచిర్యాల వార్త మిర్రర్ ప్రతినిధి....దేశంలో బీసీలు లేకపోతే దేవుళ్ళకు కూడా పండుగలు కరువయ్యే పరిస్థితి తలెత్తుతుందని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ ఉద్ఘాటించారు.. దేశ గణనలో ఎస్సీ ఎస్టీల గణనతో పాటు బీసీలను కూడా లెక్కించకపోవడం దేశద్రోహమే అవుతుందని తెలిపారు.. దేశవ్యాప్తంగా బీసీలు ఒక్కటవుతున్నారన్న నెపంతోనే జాతీయస్థాయిలో బీసీల గణనను చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం వెనుకాడుతుందని మండిపడ్డారు..ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్, రాష్ట్ర కోఆర్డినేటర్ మాచర్ల శ్రీనివాస్ నేతృత్వంలో మంచిర్యాల లోని నస్పూర్ ప్రెస్ క్లబ్ నందు జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు..కార్యక్రమానికి హాజరైన నాయకులను ఉద్దేశించి దాసు సురేశ్ మాట్లాడుతూ బీసీలు న్యాయంగా తమకు దక్కాల్సిన 50% అవకాశాలను దక్కించుకోవడమే నిజమైన ధర్మమని అందుకోసం ఎన్ని ఆటంకాలు ఎదురైనా తమ హక్కుల సాధన కోసం విశ్రమించేది లేదని తేల్చి చెప్పారు..ఊరికి ఒకరు కలిసి వస్తే రాష్ట్రంలో, దేశంలో రాజకీయ పార్టీలకు బీసీల పట్ల అనివార్యత సృష్టిస్తామని., ఇంటికొకరు కలిసి వస్తే రాజ్యాధికారాన్ని అట్టడుగు వర్గాల చేతిలో బహుమతిగా అందిస్తామని దాసు సురేష్ పిలుపునిచ్చారు..ఎటువంటి ప్రాతిపదిక లేకుండా అశాస్త్రీయంగా, అన్యాయంగా పార్లమెంటులో అగ్రవర్ణ ఆధిపత్య పార్టీల ఆమోదంతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు దొడ్డిదారిన పార్లముంటులో ప్రవేశించాయని బీసీ రాజాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ పేర్కొన్నారు.103వ రాజ్యాంగ సవరణ ద్వారా 2019లో ప్రవేశపెట్టిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ద్వారా నేడు అట్టడుగు వర్గాలకు విద్య ఉద్యోగ అవకాశాలు అందక యువత నైరాశంలోకి నెట్టబడి పరిస్థితులు దయనీయంగా మారాయని దాసు సురేశ్ పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ వలన బీసీ ఎస్సీ ఎస్టీ లకు కొనసాగుతున్న తీవ్రమైన నష్టాన్ని పూడ్చుడానికి త్వరలోనే హై కోర్ట్ లో రిట్ పిటిషన్ దాఖలు చేయనున్నామని దాసు సురేష్ తెలిపారు..కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఉపకరించే విధంగా తమిళనాడు తరహాలో రాష్ట్రంలో ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ల అమలును రద్దు చేయాలని కోరారు.. 8 లక్షల పైబడిన సంపాదన ఉన్న బీసీ వర్గాలను క్రిమి లేయర్ గా అభివర్ణిస్తు వారిని రిజర్వేషన్లకు దూరం చేస్తూ 8 లక్షల సంపాదన ఉన్న అగ్రవర్ణ విద్యార్థులను మాత్రం పేదవారుగా పరిగణించడం ఏ మేరకు సమంజసం అని దాసు సురేష్ పేర్కొన్నారు..దేశ జనాభా గణనలో బీసీల గణన ,మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా, దేశవ్యాప్తంగా ఎటువంటి ప్రాతిపదిగా లేకుండా హడావుడిగా తీసుకొచ్చిన ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దు, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు తదితర అంశాలపై దేశంలోని రాజకీయ పార్టీలను ఏకంచేసి బలమైన ఉద్యమాన్ని నిర్మించనున్నట్టు దాసు సురేష్ తెలిపారు.. ఇప్పటికే క్షేత్రస్థాయిలో బీసీల నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ అన్ని జిల్లాలలో నాయకత్వ నిర్మాణాన్ని చేపట్టామని,యువ నాయకులను,మహిళలను ఢిల్లీకి తీసుకెళ్లి వ్యూహాత్మకంగా బీసీల సత్తాను ఢిల్లీకోటకు చాటుతామని తెలిపారు..బీసీలు సమర్థమైన నాయకులను తయారు చేసుకోకపోవడం, నిర్ణయాలు జరిగే అసెంబ్లీ పార్లమెంటులలో ఈ వర్గాలు లేకపోవడం వల్లనే ఇటువంటి దారుణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.యువత మహిళలు రాజకీయాల్లోకి రానంతవరకు ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగుతాయని తెలిపారు.. అందుకే తాము క్షేత్రస్థాయిలో నాయకత్వ నిర్మాణానికి సంకల్పించామన్నారు.. అగ్రవర్ణాల ప్రజలు తమ వాటాను తాము అనుభవించుకుంటూనే బీసీ ఎస్సీ ఎస్టీల వాటాను కూడా అనుభవిస్తామనడం ఏ మేరకు సమంజసం ఉన్నారు.. ఇకపై అగ్రవర్ణాల వాటా అగ్రవర్ణాలు., అట్టడుగు వర్గాల వాటా అట్టడుగు వర్గాలు అనుభవించేలా సామాజిక న్యాయాన్ని సాధిస్తామన్నారు..అట్టడుగు వర్గాలు బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడకపోవడం వల్లనే అగ్రవర్ణాల అజమాయిషి కొనసాగుతుందని., అధికారం కోసం బీసీలు తిరగబడితే అనివార్యంగా అగ్రవర్ణాలు వారి కుర్చీలు ఖాళీ చేసే రోజు ఎంతో దూరంలో లేదని దాసు సురేష్ పేర్కొన్నారు.. తదనంతరం మంచిర్యాల జిల్లా ఇంచార్జ్ గా పిట్టెం లక్ష్మణ్ , కన్వీనర్ గా వడ్డేపల్లి మనోహర్ లను నియమించారు.. త్వరలో నిర్వహించనున్న ఢిల్లీ యాత్రకు బీసీ నాయకులు పెద్ద ఎత్తున దిల్లీకి తరలాలని పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి మహిళా ఉపాధ్యక్షురాలు ఏరుగొండ పద్మావతి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు బండారు పద్మావతి, ప్రధాన కార్యదర్శి గోషిక స్వప్న ,పారసాని దుర్గేష్ ప్రసన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యులు జంగోని స్వరూప, బుర్రా కుమార్ గౌడ్ , జూలూరి రమేష్ గౌడ్ , రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు వీరేందర్ గౌడ్ , ప్రముఖ సామాజిక వేత్త కోడూరి చంద్రయ్య , సింగరేణి ఓబీసీ కార్మిక యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, బీసీ ఐక్యవేదిక ముఖ్య నాయకులు రంగు రాజేశం , గుమ్మల శ్రీనివాస్ , వడ్డేపల్లి మనోహర్ , స్థానిక బీసీ నాయకులు కోట వెంకన్న, ఆడెపు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు .

# జిల్లా సమగ్రాభివృద్ధికి బలమైన పోరాటాలు

### నేటి నుంచి సీపీఎం జిల్లా 21 వ మహాసభలు

### బహిరంగ సభ కు వేలాదిగా తరలిరావాలి

### విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి



మిర్యాలగూడ, డిసెంబర్ 1:- (వార్త మిర్రర్)

జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం భవిష్యత్తులో బలమైన పోరాటాలు నిర్వహిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు చేస్తామన్నారు. దీనికోసం మిర్యాలగూడలో జరిగే సిపిఎం 21వ జిల్లా మహాసభలు వేదిక కాబోతున్నాయని తెలిపారు. గత మూడు సంవత్సరాల కాలంలో ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించామని, పాదయాత్ర చేపట్టామని తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రాజెక్టుల సందర్శన చేపట్టామని చెప్పారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న డిండి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వీటి పరిధిలో ఉన్న మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని కోరారు. ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. మూసి ప్రాజెక్ట్ పునరుద్ధరించాలని కోరారు. జిల్లాలో 17 మండలాలు పెండింగ్లో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ కూలి దినాలు పెంచాలని రోజు కనీసం 600 రూపాయలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు దీని కోసం చట్టం చేయాలన్నారు. బడ్జెట్లో నిధులు పెంచాలని కోరారు. గతంలో సిపియం పార్టీ ఆధ్వర్యంలో చేసిన పోరాటాలు ప్రజా ఉద్యమాలపై సుదీర్ఘంగా చర్చించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు చేపడతామని తెలిపారు.బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలి నేడు మిర్యాలగూడలో జరిగే సిపిఎం మహాప్రదర్శన భారీ బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుండి అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలిరావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సుమారు 10 నుంచి 15 వేల మందితో ఈ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. దీనికిగాను అని ఏర్పాటు పూర్తి చేశామన్నారు. ఈ బహిరంగ సభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, మల్లు లక్ష్మి హాజరవుతున్నట్లు తెలిపారు, 3, 4 తేదీలలో స్థానిక బృందావన్ గార్డెన్ లో ప్రతినిధుల మహాసభ జరుగుతుందని సుమారు 600 మంది ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు సీనియర్ నాయకులు పెన్నా అనంతరామ శర్మ నగర్లో ఈ మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 409 శాఖల మహాసభలను పూర్తి చేసుకుందామన్నారు. 4182 మందితో సభ్యత్వం కలిగి ఉందన్నారు. బహిరంగ సభకు అనువర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్, డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, భవాండ్ల పాండు, శశిధర్ రెడ్డి, ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేష్ కమ్మంపాటి శంకర్, నాయకులు రొండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మూడో తేదీ నుండి ప్రజా పాలన విజయోత్సవాలు



మిర్యాలగూడ డిసెంబర్ 1:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మున్సిపల్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలో ఈ నెల 3 నుండి 9 వరకు విజయోత్సవాలు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ తెలిపారు. ఈ నెల 3నుండి 9 వరకు 6 రోజులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, తెలంగాణ అమర వీరుల స్తూపం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, జాతీయ నాయకుల విగ్రహాలను విద్యుద్దీపాలతో అలంకరించనున్నట్టు తెలిపారు. పట్టణంలో 2కె రన్, మున్సిపల్ పనులు, మహిళాశక్తి యూనిట్ల ప్రారంభోత్సవం, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, పట్టణ ప్రముఖులు, ప్రముఖ నాయకులతో ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ, చెత్తా చెదారం తొలగించడం, ముగ్గుల పోటీలు, మున్సిపల్ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం, పబ్లిక్ టాయిలెట్స్, ప్రభుత్వ పాఠశాలలు, మత, చారిత్రాత్మక కట్టడాల, సంబంధ ప్రార్థన ప్రదేశాల వద్ద స్పెషల్ డ్రైవ్ లో భాగంగా పారిశుధ్యం, పారిశుధ్య కార్మికులకు పీపీఇ కిట్లు, భద్రత సామాగ్రి పంపిణీ, మహిళా శక్తి కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజ్ చెక్కుల పంపిణీ, పారిశుధ్య కార్మికులకు సన్మానం, ఇందిరా మహిళా స్టాల్స్ ప్రదర్శన చేయనున్నారు ఆయన తెలిపారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ పర్యావరణ ఇంజనీర్ శ్వేతా లున్నారు.



## మహారాష్ట్రలో పద్మశాలి ప్రభంజనం బొల్లా శివశంకర్

సంస్థాన్ నారాయణపూర్ డిసెంబరు 1:( వార్త మిర్రర్) మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సోలాపూర్ సెంట్రల్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన మన పద్మశాలి ముద్దుబిడ్డ శ్రీ దేవేందర్ కోటే. ఈ నేపథ్యంలో పద్మశాలి అభ్యర్థుల విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన అఖిల భారత పద్మశాలి రాజకీయ విభాగం అధ్యక్షులు బొల్లా శివ శంకర్, ఉపాధ్యక్షులు చిలుకూరి మాధవికి ధన్యవాదములు తెలియజేసిన ఎమ్మెల్యే దేవేందర్ కోటే. ఈ సందర్భంగా బొల్లా శివ శంకర్ మాట్లాడుతూ పద్మశాలి నాయకులు దేశంలో ఎక్కడ ఉన్న వారి విజయం కోసం అహర్నిశలు పోరాటం చేస్తామని అన్నారు.

## సమాచార హక్కు చట్టం -2005 బోర్డు అన్ని ప్రభుత్వ కార్యాలయం లో ఏర్పాటు చేయాలి

### -దబ్బటి శేఖర్



వార్తా మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 01 సమాచార హక్కు చట్టం-2005 బోర్డు అన్ని ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని సమాచార హక్కు రక్షణ చట్టం -2005 యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దబ్బటి శేఖర్ పత్రిక ముఖంగా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాను అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఏర్పాటు చేయాలని సమాచార హక్కు చట్టం -2005 బోర్డు ఏర్పాటు చేయని కార్యాలయలలో అధికారులు స్పందించి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



## రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

మిర్యాలగూడ, డిసెంబర్ 1:- (వార్త మిర్రర్) నల్గొండ జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ జిల్లా పురుషుల, మహిళల బేస్ బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను నిర్వహించారు. ఎంపిక పోటీల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బండి మోహన్ యాదవ్ ట్రాఫిక్ ఎస్ఐ, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, అతిథులుగా కే, వెంకటేశ్వర్లు ,బి వెంకటరత్నం, వెంకటేశ్వర్లు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడలో మంచి ప్రతిభను కనబరచి జిల్లా జట్టుకు ఎంపిక కావాలని క్రీడాకారులను ఉద్దేశించి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా బేస్ బాల్ జిల్లా అధ్యక్షులు అమరావతి సైదులు, కార్యదర్శి చిత్ర మల్లేష్ మాట్లాడుతూ ఈ జిల్లా జట్టు ఎంపికకు జిల్లా నలుమూలల నుంచి 160 మంది పైగా క్రీడాకారులు పాల్గొనగా జిల్లా పురుషుల మహిళల జట్టను ఎంపిక చేశామని జిల్లా మహిళా జట్టు ఈనెల 7న జగిత్యాల్ జిల్లాలో పురుషుల జట్లు ఈనెల 13వ తేదీ మహబూబ్నగర్ లో జరిగే నాలుగవ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్బాల్ పోటీలలో జిల్లా జట్లు పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా బేస్ బాల్ సెక్రెటరీ ఎన్ జోజి, వ్యాయామ ఉపాధ్యాయులు సుజాత, సునీత, నాగమణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప దీక్ష మాలధారణ స్వాముల నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 01

శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం లో అయ్యప్ప స్వాముల నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించిన మార్గం బాగ్యమ్మ వారి కుమారుడు మార్గం శేఖర్ యాదవ్ అన్నప్రసాదం నిర్వహించడం జరిగింది.వారికి కుటుంబానికి అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి అని అయ్యప్పస్వామిని స్వాములు మనసారా కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో సన్నిధానం గురుస్వాములు తొర్పునురి నరసింహ గౌడ్,చెరకు అశోక్ గౌడ్, చెవగొని మహేష్ గౌడ్, ఐతగొని శ్రీను గౌడ్, సొవ్వాజు మల్లేష్ చారి, కళ్లెం నాగరాజు గౌడ్, బత్తుల మల్లేష్ గౌడ్, పోల్దాస్ రాజు, మారగొని గణేష్ గౌడ్,చెరకు రాము గౌడ్,పబ్బు శ్రీకాంత్ గౌడ్,మలిగె రవి, ఉప్పుగుల శ్రీశైలం గౌడ్, మేకల అనిల్, దేశగొని రాజు, సన్నిధానం స్వాములు మీసాల శ్రీకాంత్, జగన్,చెరకు రాకేష్ గౌడ్, మలిగె సాయి,మార్గం శేఖర్,మోహన్ కృష్ణ, మాదగోని స్వామి, హర్ష గౌడ్,ఆప్పిడి శేఖర్ రెడ్డి,శివ, ఆందోజు సన్నిత్ చారి,కురకుల నాగరాజు, చెవగోని శ్రవణ్,సురేష్,శ్రీకాంత్,గుండు రాజు,గంట నరేందర్ సాగర్, ఉప్మాగుల బోసు, భాను, కొండ శశి మహేందర్, తదితరులు పాల్గొన్నారు

## భువనగిరి పట్టణ కేంద్రంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న

### బిఆర్ఎస్ నేతలు జనగాం పాండు- డా, ర్యాకల శ్రీనివాస్

భువనగిరి వార్త మిర్రర్ ప్రతినిధి ( గణేష్ సాగర్)



యాదాద్రి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రంలో పచ్చల కట్ట సోమేశ్వరాలయ చైర్మన్ కొల్లూరి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న భువనగిరి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డా. ర్యాకల శ్రీనివాస్, కోడే ప్రభాకర్ రాజు, అయ్యప్ప స్వామి మహా పడిపూజలో భక్తులు, అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. స్వామిని స్మరిస్తూ భజన కీర్తనలతో పాటలు పాడారు. 18 పడిమెట్లకు పూజలు చేశారు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు కార్యక్రమంలో ప్రజలు భక్తులు పాల్గొన్నారు



## భరత్ డైనమిక్స్ లిమిటెడ్ ఎంప్లాయిస్ యూనియన్.అధ్యక్షుడిగా వెంకటాపురం దానాకర్ణ చారీ

వార్త మిర్రర్ ( రంగారెడ్డి జిల్లా ప్రతినిధి.. ధనుంజయ్ నేత ) .. డిసెంబర్ 1 ==

భరత్ డైనమిక్స్ లిమిటెడ్ ఎంప్లాయిస్ యూనియన్. ( బి డి టీ ఈ యు )ఎన్నికలలో ఘన విజయం సాధించి అధ్యక్షుడిగా ఎన్నికయిన ఉద్యమకారుడు వెంకటాపురం దానాకర్ణ చారీ కి గుళ్ల సంతోష్ ముదిరాజ్.శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమం లో మట్ట నర్సింగ్ రావు. కూడ్తల రాజేష్. సంపంగి రవి కుమార్.పందిగొట్టు రాము. శ్రీనివాస్.తదితరులు పాల్గొన్నారు

## పంతు నాయక్ సేవలు చిరస్మరణీయం:

### - మాజీ జెడ్పిటిసి..దశరథ్ నాయక్



కడ్తాల్ డిసెంబర్ 1 వార్త మిర్రర్ ప్రతినిధి:–ఆమనగల్ మాజీ ఎంపీపీ గిరిజనుల ముద్దుబిడ్డ పంతు నాయక్ సేవలు చిరస్మరణీయమని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. గిరిజన జాతి కోసం తన జాతి అభ్యున్నతి కోసం ఎంతగానో పోరాడిన మహానీయుడు పంతు నాయక్ అన్నారు. అలాంటి పంతు నాయక్ ఈ రోజు తమ మధ్యన లేకపోవడం బాధాకరమని అన్నారు. ఆయన భౌతికంగా లేకపోవచ్చు కానీ ఆయన చేసిన సేవలు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా ఉన్నాయని తెలిపారు. ఇవాళ ఆయన వర్ధంతి సందర్భంగా మైసిగండిలో ఆయన విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి లచ్చిరాం నాయక్ ప్రియా రమేష్ మాజీ సర్పంచ్ తులసి రామ్ నాయక్ ఐక్యవేదిక అధ్యక్షులు రాఘవేందర్ పంతు నాయక్ కుమారుడు భాస్కర్ నాయక్ నాయకులు కృష్ణ గోపాల్ రాజ్ కుమార్ అంజి జగన్ శ్రీకాంత్ భాస్కర్ శ్రీను నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకి రిసెప్షన్ కి ఆహ్వానాన్ని అందజేత

### - మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్,ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్

కల్వకుర్తి నవంబర్ 1 వార్త మిర్రర్ ప్రతినిధి:– ఈ నెల 8 న తలకొండపల్లి చౌరస్తా రంగారెడ్డి జిల్లా లో జరగనున్న డాక్టర్ ఉప్పల అనిల్ డాక్టర్ భావన వివాహ రిసెప్షన్ (విందు) కు రావలసిందిగా భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ని నందిని నగర్,హైదరాబాద్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,ఉప్పల వెంకటేష్ అన్న సైన్యం దారమోని గణేష్,సిద్ధమోని రమేష్ గౌడ్,బుచ్చి బాబు,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పల్లవి మోడల్ స్కూల్ ల్లో ముగిసిన రాష్ట్రస్థాయి టెన్నిస్ వాలీబాల్ చాంపియన్షిప్

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 1.... తిరుమలగిరిలోని పల్లవి మోడల్ స్కూల్లో మూడవ తెలంగాణ టెన్నిస్ వాలీబాల్ స్టేట్ ఛాంపియన్‌షిప్, 2024 ఘనంగా జరిగింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా టెన్నిస్ వాలీబాల్ అసోసియేషన్, తిరుమలగిరిలోని పల్లవి మోడల్ స్కూల్ స్పాన్సర్‌తో నిర్వహించిన ఈ ఆట 2024, నవంబర్ 30న ప్రారంభమైంది. ఇందులో జనగాం, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట, వరంగల్, మెదక్, ఆదిలాబాద్, హన్మకొండ, సిద్దిపేట, వికారాబాద్, కొత్తగూడెం, నల్గొండ జిల్లాల నుంచి సుమారు 200 మంది పాల్గొన్నారు. టెన్నిస్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహం, టెన్నిస్ వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి బాలరాజ్, పల్లవి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి విజయలక్ష్మి సాగర్ ముఖ్య అతిథులుగా హాజరై ఆటను ప్రారంభించారు. మినీ గర్ల్స్, మినీ బాయ్స్, యూత్ గర్ల్స్, యూత్ బాయ్స్ అనే 4 విభాగాల్లో మొత్తం 56 జట్లు పాల్గొన్నాయి.రెండు రోజుల గట్టి పోటీ తర్వాత, డిసెంబర్ 1వ తేదీన పోటీలు ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ జాతీయ టెన్నిస్ వాలీబాల్ క్రీడాకారుడు శ్రీ శివశంకర్ వరప్రసాద్ యాదవ్, గౌరవ అతిథిగా మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా టెన్నిస్ వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. ఆనంద్ హాజరయ్యారు.ముగింపు కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా అవార్డులు పంపిణీ చేశారు. మినీ బాలికల విభాగంలో వరంగల్ జట్టు ప్రథమ, జనగాం ద్వితీయ బహుమతి సాధించారు. మినీ బాలుర విభాగంలో హైదరాబాద్‌కు ప్రథమ, రంగారెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచాయి. యూత్ గర్ల్స్‌లో హైదరాబాద్ జట్టు ప్రథమ బహుమతి సాధించగా, జనగా%శీ% ద్వితీయ స్థానంలో నిలిచింది. యూత్ బాలుర విభాగంలో సంగారెడ్డి ప్రథమ స్థానం, సిద్దిపేట ద్వితీయ స్థానంలో నిలిచాయి.అన్ని జట్లలో జాతీయ స్థాయికి ప్రాతినిధ్యం వహించే ఉత్తమ ఆటగాళ్లను కూడా ఎంపిక చేశారు.



హైదరాబాద్‌లోని తిరుమలగిరిలోని పీఎంఎస్‌కు చెందిన అభిషిక్త, వైశాలి, భావన, జనగా%శీ% కు చెందిన ఐశ్వర్య, స్వస్తిక, వరంగల్‌కు చెందిన నిహారిక, శ్వేతలతో పాటు మరికొంత మంది ఎంపికయ్యారు.గెలుపొందిన విజేతలను అతిథులు అభినందించారు. అలాగే క్రీడలలో పాల్గొన్న వారందరినీ అభినందిస్తూ, వారిని ఆటలు మెరుగయ్యేలా ప్రోత్సహించారు. ఈ రెండు రోజుల పోటీలకు సాయం అందించిన పల్లవి మోడల్ స్కూల్ సిబ్బంది, యాజమాన్యాన్ని అతిథులు కొనియాడారు. ఈ కార్యక్రమానికి హాజరైనందుకు, పాల్గొన్నందుకు, మద్దతిచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ పల్లవి మోడల్ స్కూల్ అడ్మిన్ ఆఫీసర్ ప్రసాద్ కార్యక్రమాన్ని ముగించారు.

## 118 జీవో బాధితుల ఐక్యవేదిక పేరుతో కాలనీ వాసులను భయభ్రాంతుల గురి చేయడం సరికాదు

### తీవ్రంగా ఖండించిన బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ 118 జీవో కాలనీ సంక్షేమ సంఘం ఫోరం

ఎల్బీనగర్,1 డిసెంబర్ బి.యన్ రెడ్డి నగర్ 118 జీవో కాలనీల బాధితులు ఐక్యవేదిక విడుదల చేసిన కరపత్రం లోని కొన్ని విషయాలను ఖండిస్తూ ఎస్ కే డి నగర్ కమ్యూనిటీ హాల్లోబి.ఎన్.రెడ్డి డివిజన్ 118 జిఒ కాలనీ సంక్షేమ సంఘాల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికలో పలు అంశాలను కాలనీ ప్రతినిధులు వెల్లడించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ118 జీవో అమలును నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం 118 జీవోను తక్షణమే పునరుద్ధించాలి డిమాండ్ చేశారు. 118 జీవో కన్వేయన్స్ డీడ్స్ పొందిన వారిని 22ఏ (భూమి నిషేధిత చట్టం) నుండి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మినహాయించే విధంగా ఆదేశాలు జారీ చేయించాలని కోరారు. వికెట్ ల్యాండ్ టాక్స్ ను ఇంటి టాక్స్ కట్టే ఇంటి యజమానులకు రాకుండా చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ నాయకులు మధు యాస్కి గౌడ్ ని ఈ వేదిక ద్వారా బియన్ రెడ్డి డివిజన్ 118 జీవో సంక్షేమ సంఘం ఫోరం ప్రతినిధులు డిమాండ్ చేశారు. కొద్దిరోజుల క్రితం కొంత మంది కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, ప్రస్తుత ప్రభుత్వం టిపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధు యాస్కి గౌడ్ ని కలిసి 118 జీవో పునరుద్దరణ గురించి చర్చించినప్పుడు, వారు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, గత ప్రభుత్వం ద్వారా విడుదల చేసిన 118 జీవో దేనికి పనికిరాదనిచెప్పారని గుర్తు చేశారు. ఇట్టి జీవో వలన కాలనీ వాసులకు నష్టం జరిగిందని మీ కాలనీలలో చెడు ప్రచారం చేసి దీని గురించి మీ కాలనీ లలో కరపత్రాలను పంచి సుధీర్ రెడ్డి మీద చెడు ప్రచారం చేయాలని పథకం వేశారని చెప్పారు. ప్రెస్ మీట్ పెట్టిన తర్వాత నా దగ్గరికి వస్తే నేనే స్వయంగా రెవెన్యూ మినిస్టర్ ని కలిసి మీ సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని మధు యాస్కి గౌడ్ చెప్పడం జరిగిందని వారు గుర్తు చేశారు. ఇట్టి విషయాన్నీ మధుయాష్కి వద్దకు వెళ్ళిన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిదులు ఈ విషయాలను ఈ వేదికపై నుండి వివరిస్తూ మధు యాస్కి వైఖరిని ఈ వేదిక ద్వారా బియన్ రెడ్డి డివిజన్ 118 జీవో కాలనీ సంక్షేమ సంఘల ఫోరం ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. 118 జీవో ద్వారా కన్వేయన్స్ డీడ్స్ పొందిన వారు వారి పాత ఇంటిని కూల్చివేసి జిహెచ్ఎంసి ద్వారా అనుమతులు పొంది ఐసీఐసీఐ,



బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎల్ఐసి లలో రుణాలను పొంది కొత్త ఇల్లు నిర్మిస్తున్న విషయం కాలని వాసులు గ్రహించాలి వారు కోరారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులను వారం రోజుల క్రితం సీసీఎల్ఏ ని కలవడం జరిగిందని గుర్తు చేశారు. త్వరలోనే రెవెన్యూ మినిస్టర్ ని కలిసి 118 జీవో అమలు పునరుద్ధరణ గురించి చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉన్నదని ఈ వేదిక ద్వారా సంక్షేమ సంఘం నాయకులు స్పష్టం చేశారు. బి.యన్.రెడ్డి డివిజన్ 118 జీవో కాలనీ సంక్షేమ ఫోరంప్రతినిధులు, ఎస్ కే డి నగర్ సంక్షేమ సంఘం కన్వీనర్ పుల్లారెడ్డి, కార్యదర్శి సుధాకర్ రెడ్డి, వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల రాంబాబు, సాగర్ కాంప్లెక్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు చీమర్ల కృష్ణారెడ్డి ,బి ఎన్ రెడ్డి సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు రాజిరెడ్డి , శ్రీపురం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ముత్యంరావు, సిబిఐ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మువ్వ సతీష్ చౌదరి, కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, విజయనగర్ కాలనీ ఓపెన్ ప్లాట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గుజ్జ జగన్మోహన్ రెడ్డి, విజయనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు యాదగిరి, సిద్ధి వినాయక హిల్స్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు రాజు యాదవ్, అసోసియేషన్ సభ్యులు కృష్ణారావు, జానకి రామారావు, గోపాల్ రావు, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, విద్యాసాగర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

### - గ్రామ సర్పంచ్ అభ్యర్థి.. యం శ్రీనివాసులు ముదిరాజ్



కల్వకుర్తి డిసెంబర్ 1 వార్త మిర్రర్ ప్రతినిధి:– కల్వకుర్తి మండలంలోని జీడిపల్లి నుండి,మాదారం శివారు మధ్య ఉన్న రహదారి పై పడి ఉన్న గుంతలను ఆదివారం రోజు సొంత నిధులతో పూడ్చే పనులకు యువ నాయకుడు కాబోయే జీడిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి ముందు నుంచే గ్రామ అభివృద్ధి కోసం పలు రకాల పనులకు శ్రీకారం చుట్టారు. జీడిపల్లి నుంచి మాదారం శివారు వరకు రహదారి మొత్తం గుంతల మయం కావడంతో ఈ దారిన వెళ్లే ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు చూసి శ్రీనివాసులు తమ సొంత నిధులతో మరమ్మతు పనులు ప్రారంభించారు.గతంలో వేసిన రోడ్లు పై గుంతలు,వర్షాల వల్ల రోడ్డుకు ఇరువైపులా వర్షపు నీరు కొయ్యడంతో గుంతల మయంగా మారాయి.కె ఎల్ ఐ నీటినీ రైతులు పైపులైన్లు ద్వారా వేసుకొని రోడ్డుపై గుంతలను పూడ్చడం మరిచారు. ఈ గుంతలు కాస్త వర్షాల వల్ల పెద్ద గుంతలుగా మారాయి. ఇదే మార్గం గుండా మోతాదుకు మించి అధిక బరువుతో అక్రమంగా వెళ్లే ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు, పౌల్ట్రీఫామ్ యొక్క వాహనాల వల్ల రోడ్లు మొత్తం గుంతల మయంగా మారింది. ప్రయాణించాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు అంటున్నారు. కల్వకుర్తి మండలం కనుక ఎమ్మార్వో ఆఫీస్, పోలీస్ స్టేషన్, ఎంపీడీవో ఆఫీస్, రిజిస్ట్రేషన్ ఆఫీస్, గవర్నమెంట్ ఆసుపత్రి,పలు రకాల పనుల నిమిత్తం. ఎల్లికట్ట, గుడియనీ పల్లి, రేవల్లి, మాదారం,జీడిపల్లి పలు గ్రామ తండాల ప్రజలు మండలానికి రాకపోకలు ఇదే మార్గం గుండా వెళ్లాల్సి ఉంటుంది. రోడ్లపై ఉన్న గుంతల వల్ల ప్రయాణికుల ఇబ్బందులను గమనించిన జీడిపల్లి యువ నాయకుడు శ్రీనివాసులు ముదిరాజ్ గుంతలను పూడ్చేందుకు సొంత ఖర్చులతో ఆదివారం రోజు పనులు ప్రారంభించి పూర్తి చేసినందున వాహనదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## ధైర్య పడొద్దు అండగా నేనుంటా

### - జిల్లెల్ల మాజీ సర్పంచ్.. రాములు

కల్వకుర్తి డిసెంబర్ 1 కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామంలో దార సాయమ్మ మరణించింది.మృతి విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు మృతురాలి కుటుంబాన్ని పరమర్శించి, మృతురాలి భర్త దార జంగయ్య కు రూ"3000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు.మృతురాలి కుటుంబానికి అన్నివిధాలా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు .ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ కొమ్మగోని రవిగౌడ్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,దేవాలయ వైస్ చైర్మెన్ శ్యామ్ సుంధర్ రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షుడు గుమ్మకొండ మహేందర్,యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎముక శ్రీహరి,కుర్వ సంఘం అధ్యక్షుడు చిక్కొండబీరయ్య,నాయకులు పెరుమాల్ల శ్రీశైలం, మొక్తాల బాల్ జంగయ్య,డొక్కా జంగయ్య,పట్టపర్ల సత్యనారాయణ గౌడ్, నాప బీరయ్య,కొమ్మగోని వెంకటయ్య గౌడ్,తోటపల్లి నర్సింహా,తోటపల్లి కృష్ణ,చిక్కొండ శ్రీశైలం,డొక్కా బాలరాజ్,తాడెం లింగం, తాడెం ఆంజనేయులు,మదన శ్రీను,రాచకొండ నరసింహ, గుమ్మక్కొండ ప్రభాకర్, గుమ్మకొండ నిరంజన్, గుమ్మకొండ ఎట్టయ్య, ఎముక జంగయ్య, కుమ్మరి శ్రీను, జమ్ముల కృష్ణ, నాప రమేష్, బోయ యాదయ్య, కుమ్మరి నితిన్,బోయ అభిరామ్, గుమ్మకొండ వెంకటయ్య, దార గణేష్, చిలుక రుక్కయ్య, మొక్తల పెద్ద యాదయ్య, చిన్న యాదయ్య, పవన్, డొక్కా శ్రీశైలం,డొక్కా కృష్ణ,రమణ, రాఖీ, మల్లేష్, శివ తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ సిఐ విజయ్ మోహన్ మాతృమూర్తి కి నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయ దేవేందర్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 01

చౌటుప్పల్ మండలంలోని ట్రాఫిక్ సిఐ విజయ్ మోహన్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందడం జరిగింది.హుజూర్ నగర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో వారి స్వగృహంలో దశదిన కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయ దేవేందర్ బ్లాక్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఊదరి నరసింహ, ఎస్ టి సెల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్,తదితరులు పాల్గొన్నారు..



## జన్మదిన వేడుకలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దేవరకొండ డిసెంబర్ 01 వార్త మిర్రర్ :ఎమ్మార్పీఎస్ టిఎస్ దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జి పొట్ట మురళి మాదిగ తన కుమారుడు పొట్ట రణధీర్ ప్రసాద్ జన్మదిన వేడుకలు దళిత నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. వారితోపాటు సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ మద్దిమడుగు రవి ఎమ్మార్పీఎస్ టి ఎస్ వివిధ మండల అధ్యక్షులు అందుగుల సైదులు కొమ్ము ఉదయ్ రమనంపల్లి వెంకట్ తరి గోవర్ధన్ ఎర్ర విజయ్‌కుమార్ చాట్ల ప్రశాంత్ కుక్కముడి లక్ష్మణ్ ఎర్ర సైదులు కుక్కల జాషువా పాల్గొన్నారు.




## మాలల సింహా గర్జన సభకు తరలిన జగిత్యాల మాల సోదరులు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 1 హైదరాబాద్ లో జరిగే మాలల సింహా గర్జన సభకు డా. బి ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత, తెలంగాణ మాల మహానాడు యువజన రాష్ట్ర అధ్యక్షుడు జాన గోపి ఆధ్వర్యంలో హైదరాబాద్ బయలు దేరిన జగిత్యాల జిల్లా మాల సోదరులు.

# ఋషికొండ ప్యాలెస్ భవనాలను తక్షణం వినియోగంలోకి తెచ్చే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

విశాఖపట్నం వార్త మిర్రర్ ఋషికొండ ప్యాలెస్ భవనాలను తక్షణం వినియోగంలోకి తెచ్చే విధంగా ప్రభుత్వం నిర్ణయం చేసేందుకు స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కమిటీని ఏర్పాటుచేసి సూచనలను స్వీకరించాలని పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఋషికొండలో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా ఏళ్ల తరబడి ఉంటే దీనివల్ల నష్టపోవడమే తప్ప లాభపడడం సాధ్యం కాదని వారు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఉదయం వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నరవ ప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య బాలమోహనదాస్, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, సామాజికవేత్త సన్ మూర్తి, ప్రముఖ జర్నలిస్టు శివశంకర్, ఆచార్య ముత్యాలరావు వింటాక్ ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. అదేవిధంగా వివిధ బౌద్ధ సంఘాలకు చెందిన ప్రతినిధులు వెంకటరమణ, కస్తూరి తదితరులు దీనిని మ్యూజియంగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ నిర్వహణలో ఖర్చుల భారం ప్రభుత్వంపై పడకుండా విడివిడిగా ఈ భవంతులను వివిధ కార్యక్రమాల నిమిత్తం కేటాయించాలని వక్తలు పేర్కొన్నారు. సామాజిక విశ్లేషకులు సన్ మూర్తి మాట్లాడుతూ బవంతుల నిర్వహణ ప్రభుత్వమే చేపట్టినప్పటికీ ప్రైవేటుగా కాంట్రాక్ట్ ఇచ్చి నిర్వహణను చేపట్టాలని సూచించారు. ఒకటి రెండు భవనాలను టూరిజం వసతిగృహంగా, మరో రెండు భవనాలను చిత్ర పరిశ్రమ షూటింగులకు అనుగుణంగా, ఇంకో రెండు భవనాలను పురావస్తు



భద్రతా కేంద్రాలుగా, తీర్చిదిద్దాలని ఇంకో భవనాన్ని వీఐపీల అతిథి కేంద్రంగా మార్చాలని సూచించారు.కార్యక్రమంలో జయశ్రీ, హుస్సేన్, హ్యూమన్ రైట్స్ శ్యాంప్రసాద్ ,డాక్టర్ బాబ్జి,శీతల్, చిన్నారావు, మేడ మస్తాన్ రెడ్డి, తెలుగు భాష ప్రతినిధి మూర్తి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో చేపట్టిన నిర్ణయాలను అభిప్రాయాలను ప్రభుత్వానికి పంపుతామని కన్వీనర్ నరవ ప్రకాశరావు వెల్లడించారు.



## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: రాందేవ్ బాబా

వార్త మిర్రర్ శంషాబాద్ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పెంపొందుతుందని, ప్రతి ఒక్కరు జీవన శైలిలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలని పతాంజలి యోగ గురువు రాందేవ్ బాబా అన్నారు. ఆదివారం ఢిల్లీలో హరిద్వార్ ప్రాంతంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి డైరెక్టర్ మల్కారం పిఎసిఎస్ చైర్మన్ బుర్కుంట సతీష్ పాల్గొని రాందేవ్ బాబా ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... శారీరక వ్యాయామం చేయాలని ప్రస్తుత తరుణంలో మానసిక ఒత్తిడి యువత ఎదుర్కొనలేక పోతుండడంతో ధాన్యం యోగాతో మనసును కట్టడి చేసినట్లయితే మంచి మార్గం పయనించవచ్చునన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఇబ్రహీం, రాజేష్, మహేష్ యాదవ్, లింగం శ్రీశైలం, మధుసూదన్ యాదవ్,నరేష్,విజయ్, మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రస్తుత జీవన శైలి లో ప్రతీ ఒక్కరు వ్యాయామం తప్పనిసరిగా చేయాలి

### విద్యావేత్త డా, మారగోని వెంకటేష్ గౌడ్-డా, జక్కిడి సుదర్శన్ రెడ్డి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : ప్రస్తుత జీవన శైలిలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి మంచి ఆహారంతో పాటు ప్రతిరోజు వ్యాయామం చేయడం తప్పనిసరి అని తెలుసుకోవాలని. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ, బాధ్యత కలిగి మంచి జీవనశైలిలో సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవాలన్నారు అన్నారు డాక్టర్ మారగోని వెంకటేష్ గౌడ్, ఈ సందర్భంగా జక్కిడి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ మంచి ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని నిర్మించడానికి ప్రతిరోజు పూర్వ స్నేహితులను, స్నేహితులను కలుస్తూ, చిన్ననాటి మిత్రులతో గడపాలని తెలిపారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ బాధ్యత కలిగి మంచి జీవన శైలితో సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవాలన్నారు మార్నింగ్ వాకింగ్ లో పూర్వ విద్యార్థులు వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్ తో, జక్కిడి సుదర్శన్ రెడ్డి, పాక సంతోష్ యాదవ్, డాక్టర్ మారగోని వెంకటేష్ గౌడ్, అంతటి జంగయ్య గౌడ్, సంతోష్, శ్రీనివాస్ రెడ్డి, వీర శేఖర్ తదితరులు మార్నింగ్ వాక్ లో ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను తెలిపారు



## ప్రతి రోడ్డును, గంతలు లేని రోడ్లుగా చూడాలన్న

విశాఖపట్నం వార్త మిర్రర్ : గాజువాక నియోజకవర్గం శాసనసభ్యులు మరియు, ఏపీ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాసరావు ,గాజువాక నియోజకవర్గం 66, 65 వార్డుల్లో గల గత ఐదు సంవత్సరాలుగా పడని రోడ్లన్నీ పరిశీలించి రోడ్డు విస్తరణ కార్యక్రమానానికి నాంది పలికి, నేడు జీవీఎంసీ కమిషనర్ ఆధ్వర్యంలో రోడ్లు పరిశీలించిన, కార్యక్రమానికి శ్రీకారం చుట్టున్నారు. ఈ ప్రాంతంలో 66వ వార్డు కార్పొరేటర్ మరియు 65 వార్డు కార్పొరేటర్లు శ్రీ గంధం శ్రీనివాసరావు , శ్రీబొడ్డు నరసింహ పాత్రుడు పాల్గొని,సంక్రాంతి లోపుగా ప్రతి రోడ్డును, గంతలు లేని రోడ్లుగా చూడాలన్న మాన్యశ్రీ చంద్రబాబు నాయుడు, ఆదేశాల మేరకు ఇప్పటికే 50 శాతం రోడ్లు పూర్తిచేసినా, మిగతా 50 శాతం పనిని సంక్రాంతి లోపుగా పూర్తి చేసి గంతలు లేని చూపించాలని కృత నిశ్చయముతో అటు జీవీఎంస్సీ కమిషనర్ , ఇటు పల్లా శ్రీనివాసరావు 65 వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు , అహర్నిశలు కృషి చేస్తున్నారు. 66 65 వార్డుల తరఫున ప్రజలుఅందరు హర్షాభి అభివందనాలు తెలియజేశారు.



## దుర్గాప్రసాద్ కన్నె స్వామి ఆధ్వర్యంలో కన్నుల పండుగగా అయ్యప్ప పడిపూజ

సికింద్రాబాద్, వార్తా మిర్రర్ డిసెంబర్ 1 ... లాలాగూడ శాంతినగర్ లో దుర్గాప్రసాద్ కన్నె స్వామి నివాసంలో అయ్యప్ప పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. రమేష్ గుప్త గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ తో అయ్యప్పకు అభిషేకం చేశారు. అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. గురుస్వాములు పాడిన అయ్యప్ప భక్తి పాటలతో భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఈ పూజలో ఎల్.ఎల్.బి శ్రీనివాస్ గురు స్వామి, శ్రీను గురు స్వామి, మహేష్ గురు స్వామి, గణేష్ యాదవ్ గురు స్వామి, సింగం రవి గురుస్వామి, వెంకటేష్ గురు స్వామి, అనిల్ గౌడ్, గోవర్ధన్ గురుస్వామి, దుర్గాప్రసాద్ కన్నె స్వామి మాతా పిత జ్యోతి, సాంబశివరావు లు, బంధుమిత్రులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

## మిర్యాలగూడ లో స్టేడియం నిర్మాణానికి 30 ఏళ్ల క్రితం ఆదేశాలు ఇచ్చిన నిర్మాణ పనులు శూన్యం

### భవనాల అద్దె స్వాహా , అక్రమ నిర్మాణాలు క్రీడాకారుల ఆందోళన



మిర్యాలగూడ డిసెంబర్ 1:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణం ఎన్ఎస్పి క్యాంపులోని రాజీవ్ స్టేడియంలో ఆక్రమణలు తొలగించాలని, అద్దెలకు ఇచ్చి స్వాహా చేస్తున్నారని సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు సుదినబోయిన శ్రీనివాస్ (ఎస్ఎస్వి) కోరారు. ఎన్ఎస్పీ క్యాంపు ఖాళీ మైదానాన్ని జిల్లా క్రీడమండలికి కేటాయించాలని కీ.శేలు దాశ రాజు వేణు పోరాట ఫలితంగా 1989లో అప్పగించారని, ఇండోర్ స్టేడియం నిర్మించి ఔట్ డోర్ స్టేడియం నిర్మాణం మరిచారని ఆయన అన్నారు. నేటివరకు నిర్మించలేదని ఆయన ఆరోపించారు. స్టేడియం ప్రహరీ గోడల వెంట బడ్డీ కొట్లు వెలుస్తున్నాయని ఆయన తెలిపారు. స్టేడియంను, పక్కా భవనాలను జిల్లా క్రీడా మండలి అధికారులు అద్దెకిస్తున్నారని, క్రీడ శిక్షణ పేరిట డబ్బులు తీసుకుంటున్నారని విమర్శించారు. తాను అడిగితే బెదిరిస్తున్నారని తెలిపారు. తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



## ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి

సంస్థాన్ నారాయణపూర్ డిసెంబర్ 1:( వార్త మిర్రర్) : నారాయణపురం గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మి ప్రసన్న షాపింగ్ మాల్ బొడ్డుపల్లి కృష్ణ నారాయణపురంలోని వారి స్వగృహంలో నిర్వహించినటువంటి అభిషేకాలు.అయ్యప్ప స్వామి పడి పూజ అనంతరం అన్న ప్రసాద వితరణ పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి మరియు నారాయణపురం మాజీ సర్పంచ్ కొన్ రేడ్డి నరసింహ బలుగూరు శివ,బొడ్డుపల్లి లోకనాథం అయ్యప్ప స్వాములు గురు స్వామి సోమన బోయిన ఐలయ్య. గురు స్వామి చిలివేరు జంగయ్య ,బాలగోని బాలరాజు.దూసరి వెంకటేష్ గౌడ్, ,చిలివేరు యాదయ్య. చిలివేరు బాబు. పందుల కార్తీక్. ఏపూరి మహేష్ ,బొమ్మగొని రఘు,జనగాం శ్రీను తదితర భక్తులు పాల్గొన్నారు




## శ్రీశ్రీశ్రీ చెల్మ ముత్యాలమ్మ దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం: ఉప్పల లింగస్వామి

సంస్థాన్ నారాయణపూర్ డిసెంబర్ 1 :( వార్త మిర్రర్) : నారాయణపురం గ్రామంలోని శ్రీశ్రీశ్రీ చెల్మ ముత్యాలమ్మ దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ చేల్మా ముత్యాలమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ ఉప్పల లింగస్వామి కోన్ రెడ్డి నరసింహ రత్తి పల్లి యాదయ్య జక్కలి యాదయ్య చిలుకూరి శ్రీనివాస్ రాచకొండ రమేష్ బాబు ఉప్పల నాగరాజు గునిగంటి రాజు మారగోని శంకర్ బద్దుల మురళి బల్లగీ శివ మరియు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## మన గోశాలకు పశుగ్రాసం అందజేత

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 1 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన వార్త మిర్రర్ రిపోర్టర్ తిరుమల శంకర్ గోమాతల పై తన ఉదారతను చాటుకున్నారు. రాయికల్ పట్టణ శివారులోని మన శివాలయం ఆవరణలో ఉన్న మన గోశాలలో పశుగ్రాసం కొరత ఏర్పడినట్లు తెలుసుకుని ఆదివారం రోజున ఒక్క ట్రాక్టర్ వరిగడ్డిని దానం చేశారు. ఇట్టి గడ్డిని రామాజీపేట కు చెందిన దశమందం మధు తన ట్రాక్టర్ లో ఉచితంగా తరలించారు. దశమందం గోపాల్, నీలి రమేష్, కోల శంకర్ లు తమ సేవలు అందించారు. ఈ సందర్భంగా తిరుమల శంకర్ మాట్లాడుతూ గోమాతలకు గ్రాసం అందించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇలాగే ప్రతి పశు పోషకులు వరిగడ్డి సమకూర్చి అందరికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. ప్రతి ఒక్కరు గోశాలకు పశుగ్రాసం అందించి గోవులను రక్షించాలని కోరారు. వీరికి మన శివాలయం తరుపున ధన్యవాదములు తెలిపారు. తిరుమల శంకర్ ను పలువురు గ్రామ ప్రజలు నాయకులు అభినందించారు.






## విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో

విశాఖపట్నం వార్త మిర్రర్ : విశాఖ సాహితి నిర్వహణలో ఆచార్య పెలమల సిమ్మన్న రచించిన సాహితీ మంజూష వ్యాస సంపుటి ఆవిష్కరణ జరిగింది.పుస్తకాన్ని ఆవిష్కరించిన నేషనల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ మేనేజర్ రాంపిళ్ళ శివాజీ మన ముందుతరాలు అందించిన సాహిత్య నిధిని మన దైనందిన జీవితానికి అన్వయించగలిగితే వ్యక్తి వికాసం సమాజ జీవనం సుఖమయమవుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన విశాఖ సాహితి ఉపాధ్యక్షులు డా. కందాళకనక మహాలక్ష్మి ఆచార్య సిమ్మన్న సామాజిక ప్రయోజనం గల రచనలు విద్యార్థులకు ఉపయుక్తమయ్యే రచనలు చేశారని అభినందించారు. సిమ్మన్న ఈ పుస్తకాన్ని ప్రముఖ కవి,నాటక రచయిత అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజుకు అంకితం ఇచ్చారు. పుస్తక సమీక్ష చేసిన డా.డి.వి సూర్యారావు సిమ్మన్న సాహిత్య వ్యాసాలు అభ్యుదయ దృక్పథం కలిగిన రచయితల గురించిన విమర్శ దృష్టి తో రాశారు. రావిశాస్త్రి నవలలు నాటకాలలో ని రాజ్యాంగ పోలీసు వ్యవస్థను సమీక్షించారు. బోయి భీమన్న దళిథ దృక్పధాన్ని తాపీ ధర్మారావు హేతువాద దృష్టిని పరిశీలించారు.సాహిత్య విమర్శ పూర్వా పరాలను చర్చించారు.సిమ్మన్న తన స్పందనలో తన గురువులు ఆచార్య కోలవెన్ను మలయ వాసిని గారి ఆశీస్సులతో ఈ సభ జరుగుతోందన్నారు అందరికీ కృతజ్ఞతలు ప్రకటీంచారు గండికోట విశ్వనాథం స్వాగతం పలికారు

## డ్రైనేజి నిర్మాణ పనులలో నాణ్యత పాటించని కాంట్రాక్టర్

### టిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు తూర్పునూరి నరసింహ గౌడ్



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 01 : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ఏర్పాటు చేస్తున్న నిర్మాణంలో భాగంగా జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణ పనులను నాణ్యత లేకుండా ఇష్టానుసారంగా చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షులు తూర్పునూరి నరసింహ గౌడ్ అన్నారు..అనంతరం మాట్లాడుతూ కాంట్రాక్టర్ ఇష్టం వచ్చినట్లుగా డ్రైనేజీ పనులు చేయడం జరుగుతుంది. ఒక సైడ్ కంప్లీట్ కాకముందే వేరే సైదు డ్రైనేజ్ నిర్మాణాలు చేయడం వల్ల పట్టణ ప్రజలు చాలా ఇబ్బందుల పడుతున్నారు..చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా జాతీయ రహదారికి ఇరువైపుల డ్రైనేజీ నిర్మాణం చేస్తున్నారని, ఇట్టి నిర్మాణం ఎలాంటి ప్రామాణికత లేకుండా ఇష్టానుసారంగా అనేక వంకలుగా నిర్మాణం చేయడం వలన డ్రైనేజీలో వాటర్ నిలువ ఉండడంతో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. సర్వీస్ రోడ్ వెడల్పు గతంలో ఉన్న దానికంటే చాలా తక్కువ వెడల్పులో కొన్నిచోట్ల వాహనాలకు కూడా ఇబ్బంది కలిగిస్తున్నట్లు అన్నారు.

## ఉరి వేసుకుని యువకుడు మృతి



దేవరకొండ డిసెంబర్ 01 వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణంలో యువకుడు ఉరి వేసుకుని మరణించిన ఘటన దేవరకొండ బిఎన్ ఆర్ కాలనీలో చోటుచేసుకుంది. దేవరకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డిండి మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన దామిడ్ర ఆంజనేయులు (30) గత కొద్ది కాలంగా తాగుడుకు బానిసై భార్య ఇంట్లో లేని సమయంలో తాగిన మైకంలో ఉరి వేసుకొని మరణించాడు. చెరుకుపల్లి గ్రామానికి వెళ్లి వచ్చిన భార్య ఇంటికి వచ్చి చూడగా ఆంజనేయులు ఉరివేసుకొని చనిపోయినట్లు ఉన్నాడని మృతుడు భార్య పోలీసులకు తెలపగా మరణించిన అంజనేయులు ఎలక్ట్రిషన్ గా పనిచేస్తున్నాడని తెలిపారు. ఆంజనేయులు భార్య స్పందన ఫిర్యాదు మేరకు దేవరకొండ పోలీస్స్టేషన్లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని దేవరకొండ సీఐ నరసింహులు తెలిపారు.

# దేవరకొండలో నిబంధనలకు విరుద్ధంగా
# అక్రమ నిర్మాణాలు




దేవరకొండ డిసెంబర్ 01 వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణంలో ఎక్కడ చూసినా అక్రమ కట్టడాలు దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని కొన్నిచోట్ల అక్రమ కట్టడాలు కడుతున్న ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంలో వెనకాడుతున్నారు. జి ప్లస్,జి ప్లస్ 1, అనుమతి నాలుగైదు అంతస్తులు ఆక్రమ కట్టబాలు నిర్మించడం ఆపై పెంట్ హౌస్ లో కూడా నిర్మాణం చేపడుతున్న దశలో అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారు. అధికారులు ప్రభుత్వాలకు తొత్తులుగా పనిచేస్తున్నారా లేక ప్రజల కోసమే పని చేస్తున్నారా ఇలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టే యజమానులకు వారిచ్చే మామూళ్లకు దాసోహం అవుతున్నారా అనే ప్రశ్నలు పట్టణంలో స్థానికుల్లో మెదలాడే అంశం..?? దేవరకొండ పట్టణంలో డిండి రోడ్డు లో దేవరకొండ పట్టణానికి చెందిన వ్యాపారవేత్త దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణం చేపట్టిన బిల్డింగుకు జి ప్లస్-2 అనుమతి దేవరకొండ మున్సిపల్ కార్యాలు నుండి తీసుకున్నారు. నిర్మాణంలో ప్రభుత్వానిబంధనల ప్రకారం నిర్మించకుండా వారి ఇష్టానుసారంగా నిర్మాణం చేపట్టడం వారికే చెల్లింది. అనుమతి తీసుకున్నప్పుడు టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభుత్వం నుండి అనుమతించిన నిర్మాణాల మేరకే నిర్మాణం చేపట్టాలని అప్పటి అధికారి సూచించగా ఇటీవల కాలంలో బదిలీపై వెళ్లిన టౌన్ ప్లానింగ్ అధికారి స్థానంలో మరొక టౌన్ ప్లానింగ్ అధికారి రాగ వారి అండదండలతో ప్రభుత్వం నియమ నిబంధనలు తుంగలో తొక్కి వారి ఇష్టానుసారంగా నిర్మాణం చేపడుతున్నారు. ఇదంతా చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారి మాత్రం అంటే ఉంటున్నట్టు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే భవనాన్ని మాత్రం సందర్శించకుండా నిర్మాణదారులు అందించే తగిలాలకు దాసోహం అవుతూ అక్రమ నిర్మాణాలను అధికారుల ఆధ్వర్యంలో ముందల మూడు బిల్డింగులు వెనుక ఆరు స్లాపులుగా నిర్మాణం జరుగుతుంది..





### అక్రమ నిర్మాణాల నిబంధనలు అమలుపరచని అధికారులు

దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో జి ప్లస్ -2 నిర్మాణాలు చేపట్టాలంటే తప్పనిసరిగా డిటిసిపి నుండి అనుమతి తీసుకోవాల్సిందే.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమ నిబంధనలు ప్రకారం టి ఎస్ చట్టం-2019 ప్రకారం నిర్మాణాన్ని నిలిపివేసే అధికారం టౌన్ ప్లానింగ్ అధికారులకు ఉండగా అధికారులే నియమ నిబంధనలను ధిక్కరిస్తూ అక్రమ నిర్మాణాల చేపడుతున్న వారికి దాసోహం అవుతున్నారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టే వారికి టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని నోటీసులను కూడా పంపించడంలో టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

### మునిసిపాలిటీలలోఅక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కు పాదం

అక్రమ నిర్మాణాలను నిర్మిస్తే సహించేది లేదు అంటూ రాష్ట్ర ప్రభుత్వం నియమ నిబంధనలను కఠినం చేస్తూ ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న హైడ్రా అక్రమ కట్టడాల కూల్చివేతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కి అనుగుణంగా పనిచేయాల్సిన అధికారులే అక్రమ నిర్మాణదారులకు దాసోహం అవుతున్నారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలంటే జిల్లా స్థాయిలో హైడ్రాను తీసుకురావాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇలాంటి అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడమే కాకుండా ప్రభుత్వా ఖజానాను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా అధికారులు అక్రమ నిర్మాణదారులకు గులాం అవుతున్నారు. ప్రభుత్వ ఖజానాను లాభాల బాటలో నడపకుండా నష్టాల బాటలో నడిపి వారి జేబులు నింపుకోవడమే పనిగా అధికారులు పనిచేస్తున్నారు. దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో ఇలాంటి అక్రమ కట్టడాలపై దేవరకొండ మున్సిపాలిటీ అధికారులు టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని పాత్రికేయ మిత్రులు కోరగా పాత్రికేయ మిత్రులను అక్రమంగా నిర్మాణం చేపట్టే వారితో చేతులు కలిపి పాత్రికేయ మిత్రులను వారికి ఉన్న రాజకీయ పలుకుబడితో బెదిరించడం కూడా జరిగింది. ప్రభుత్వ అధికారులు ప్రజల కోసం పనిచేయాలి తప్ప ఇలాంటి అక్రమాలకు అక్రమ నిర్మాణాలకు పాల్పడే వ్యక్తుల కోసం పని చేయకూడదని తెలిసిన వారు హద్దులు మీరు ఇలాంటి వారిని ప్రోత్సహించడం సరైన పద్ధతి కాదు.

### పట్టించుకోని జిల్లాస్థాయి అధికారులు

**అక్రమ నిర్మాణాలపై ఉన్నత స్థాయి అధికారులు జిల్లా స్థాయి అధికారులు ఉక్కు పాదం మోపకపోతే దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో అధికారులు టౌన్ ప్లానింగ్ అధికారులు మరింత యదేచ్ఛగా రెచ్చిపోయే అవకాశం లేకపోలేదు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయలేని అసమర్ధత టౌన్ ప్లానింగ్ అధికారులు వారు చేసే ఉద్యోగానికి సమన్వయం చేయకపోగా ప్రభుత్వాన్ని ప్రభుత్వ ఉద్యోగుల పట్ల సామాన్య ప్రజలకు నమ్మకం లేకుండా పోతుంది. ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు అక్రమ నిర్మాణ ల సంబంధిత అధికారులు ఇలాంటివి ప్రోత్సహిస్తున్న అధికారులపై ప్రభుత్వపరమైన చర్యలు తీసుకొని ఇలాంటి అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.**

- ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా అక్రమ నిర్మాణం
- తూతూ మంత్రంగా అనుమతులు అడ్డుకొని అధికారులు
- అక్రమ నిర్మాణాలకు దాసోహమైన సంబంధిత అధికారులు
- అనుమతుల పత్రంలో కంటే భిన్నంగా నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు ఉన్నతాధికారులు

## యూసీమస్ 8వ అబాకస్ కాంపిటేషన్‌ల్లో తార్నాక యుసిమస్ అబాకస్ బ్రాంచ్ విద్యార్థుల ప్రతిభ

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 1 ...అబాకస్ విద్యతో విద్యార్థులు మ్యాథ్స్ సబ్జెక్టులో నైపుణ్యత సాధించడం తో పాటు వారికి నాలెడ్జ్ పెరుగుతుందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. సికింద్రాబాద్ హర్యానా భవన్ లో తెలంగాణ వ్యాప్తంగా యూసీ మస్ ఎనిమిదవ అబాకస్ కాంపిటీషన్ లో తార్నాక యూసీ మస్ అబాకస్ బ్రాంచ్ కి చెందిన పదిమంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. వారికి తార్నాక అబాకస్ సెంటర్ ఇన్చార్జి శోభారాణి ఆధ్వర్యంలో తార్నాకలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్, ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, అతిథులు అబాకస్ యూసీ మాస్ తెలంగాణ స్టేట్ మాస్టర్ ఫ్రాన్సిస్ ప్రతినిధులు, హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమార్, సుభాష్ తదితరులు హాజరై విజయం సాధించిన విద్యార్థులకు చాంపియన్స్ మెమెంటోస్, రన్నర్ ఆప్స్, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా అబాకస్ అధ్యాపకురాలు శోభారాణి మాట్లాడుతూ చిన్న వయసు నుండి పిల్లల్లో మేధాశక్తిని సంప్రదించడానికి యూసీ మాస్ వారి అబాకస్ సెంటర్ తార్నాక (యూనివర్సల్ కాన్సెప్ట్ మెంటల్ ఆరిత్మెటిక్ సిస్టం) ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మలేషియా తో పాటు 82 దేశాల్లో ఫ్రాంచైజ్ నెట్వర్క్ తో కూడిన గ్లోబల్ అర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇటీవల



తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్లో 8వ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారని తెలిపారు. తార్నాక సెంటర్ అబాకస్ అకాడమీకి అత్యధికంగా ఛాంపియన్స్, రన్నర్స్, మెరిట్ అండ్ కన్సోలేషన్ బహుమతులు రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలు నిర్వహించడంలో యూసీ మాస్ రాష్ట్ర ఇంచార్జ్ మెహర్ చైతన్య ఎంతో కృషి చేశారని కొనియాడారు.



## మేకల వెంకటయ్యని పరామర్శించిన ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ డిసెంబర్ 01 వార్త మిర్రర్ : దేవరకొండ మండల పరిధిలోని ముదిగొండ గ్రామానికి చెందిన మేకల వెంకటయ్య ఆనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని హస్తినాపురం నవీన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని నేడు హైద్రాబాద్ లోని హస్తినాపురం నవీన ఆసుపత్రికి చేరుకోని మేకల వెంకటయ్య ని పరామర్శించి,వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని వైద్య అధికారులకు సూచించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.వారితో పాటు ప్రభాకర్ రెడ్డి,మేకల వెంకటయ్య కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.




## నవంబర్ జీఎస్టీ వసూళ్లలో 8.5 శాతం వృద్ధి!

దేశీయంగా జీఎస్టీ వసూళ్లు గణనీయంగా పెరిగాయి. నవంబర్ నెలలో రూ. 1.82 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు రికార్డయ్యాయి. గతేడాది నవంబర్ నెలలో రూ. 1.68 లక్షల కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది 8.5 శాతం వృద్ధిరేటు నమోదైంది. ఈ ఏడాది అక్టోబర్ నెలలో జీఎస్టీ వసూళ్లు తొమ్మిది శాతం పెరిగి రూ. 1.87 లక్షల కోట్లు నమోదు కాగా, ఈ ఏడాది అత్యధికంగా ఏప్రిల్ లో రూ. 2.10 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైంది. ఏప్రిల్ తర్వాత గరిష్టంగా జీఎస్టీ వసూలు కావడం నవంబర్ నెలలోనే ఫస్ట్ టైం. గత నెలలో వసూలైన రూ. 1.82 లక్షల కోట్లలో సీజీఎస్టీ రూ. 34,141 కోట్లు, ఎస్జీఎస్టీ రూ. 42,047 కోట్లు, ఐజీఎస్టీ రూ. 91,828 కోట్లు ఉన్నాయి. సెస్ ల రూపేణా రూ. 13,253 కోట్ల వసూళ్లు జరిగాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఫెస్టివ్ సీజన్ కారణంగా గత నెలలో దేశీయ లావాదేవీలు 9.4 శాతం పెరిగి రూ. 1.40 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైంది. దిగుమతుల ద్వారా పన్ను వసూళ్లు ఆరు శాతం పెరిగి రూ. 42,591 కోట్లకు చేరాయి. గతేడాదితో పోలిస్తే నవంబర్ లో రీఫండ్స్ 8.9 శాతం తగ్గి రూ. 19,259 కోట్లకు పరిమితం అయ్యాయి. గతేడాది ఏప్రిల్ %-% నవంబర్ మధ్య కాలంలో రూ. 11.81 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు నమోదు కాగా, ఈ ఏడాది రూ. 12.90 లక్షల కోట్లకు పెరిగింది.

## ఊగిసలాటలో మార్కెట్లు!




దేశీయ స్టాక్ మార్కెట్లలో లాభనష్టాల దోబూచులాటలు కొనసాగుతున్నాయి. గతకొద్ది రోజులుగా పడుతూలేస్తూ పయనిస్తున్న సూచీలు.. గడిచిన వారం కూడా అదేదారిలో నడిచాయి. మదుపరులు అమ్మకాలు, కొనుగోళ్ల మధ్య ఊగిసలాడారు. అయినప్పటికీ ఆఖర్లో పెట్టుబడులకే పెద్దపీట వేశారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 685.68 పాయింట్లు లేదా 0.86 శాతం బలపడి 79,802.79 వద్ద ఆగింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 223.85 పాయింట్లు లేదా 0.93 శాతం పుంజుకొని 24,131.10 దగ్గర స్థిరపడింది. ఈ వారం విషయానికొస్తే.. రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు, గౌతమ్ అదానీ లంచం కేసు, విదేశీ మదుపరుల పెట్టుబడులు ప్రధానంగా ట్రేడింగ్‌ను ప్రభావితం చేయవచ్చు. అయితే ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో దేశ జీడీపీ గణాంకాలు నెమ్మదించడంపై మార్కెట్ రియాక్షన్ కీలకం కానున్నది. అంతేగాక నవంబర్ నెల వాహన విక్రయాలు ఆటో షేర్లపై ప్రభావం చూపవచ్చు. అలాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు కూడా ముఖ్యమే. అమెరికాలో పెరిగిన ద్రవ్యోల్బణం, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లపై ఊహాగానాలనూ తోసిపారేయలేమన్న అంచనాలున్నాయి. దీంతో ఒడిదొడుకులు ఈ వారం కూడా తప్పవనే అనిపిస్తున్నది. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,500-24,700 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు. స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.



## ఘనంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పోలీస్ కృష్ణయ్య వర్ధంతి వేడుకలు

దేవరకొండ డిసెంబర్ 01 వార్త మిర్రర్ : తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమ అమరుడు ముదిరాజ్ ముద్దుబిడ్డ పోలీస్ కృష్ణయ్య అని దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ అన్నారు. దేవరకొండ పట్టణంలో ఆదివారం నాడు దేవరకొండ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుడు పోలీస్ కృష్ణయ్య 15వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, దేవరకొండ మాజీ సర్పంచ్ పున్న వెంకటేష్ లు హాజరై కానిస్టేబుల్ కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం కానిస్టేబుల్ కృష్ణయ్య మలిదశ తెలంగాణ ఉద్యమంలో కానిస్టేబుల్ కృష్ణయ్య తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగమయ్యారని వారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ముదిరాజ్ బిడ్డ పోలీస్ కృష్ణయ్య మరణం ఉద్యమానికి మరింత ఊపిరి పోసింద ని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు జిల్లా నాయకులు జింకల లింగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు జింకల రవి, దేవరకొండ పట్టణ అధ్యక్షులు రాసమల్ల నాగయ్య తూటుపల్లి శ్రీను ప్రధాన కార్యదర్శి రెడ్డి శంకర్ వర్కింగ్ ప్రెసిడెంట్ పంగ అజయ్ కార్యదర్శి జింకల మధు నీల వెంకటయ్య రెడ్డి శ్రీను జింకల రాములు ఏదుల విజయ్ ల్యాబ్ శీను కాటమోని రాము తోటపల్లి రాంబాబు పుట్ట శ్రీను వల మౌనిఅంజయ్య యాదగిరి రాజు తదితరులు పాల్గొన్నారు.